సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
గురువారం, 23.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 181
పేజీలు: 12 వెల: రూ. 5

## కాళేశ్వరంపై చర్యలొద్దు
### ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు 10

- ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై విచారణ
- సెక్షన్ 8 కింద నోటీసు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదు
- హైకోర్టు తీర్పుతో బీఆర్ఎస్ సంబరాలు






# తొలిరోజు సమ్మె సక్సెస్
## చాలా చోట్ల డిపోలు దాటని ఆర్టీసీ బస్సులు
### పలు ప్రాంతాల్లో ప్రైవేట్ డ్రైవర్లతో నడిపిన ప్రభుత్వం

- పోలీసుల బందోబస్తు మధ్య ప్రజారవాణా
- కండక్టర్లు అందుబాటులో లేకపోవడంతో టిక్కెట్లు తీసుకోని పురుషులు
- ఉచితంగా ప్రయాణం చేసిన మహిళలు
- గన్ పార్క్ వద్ద ఆర్టీసీ జేఏసీ నిరసన
- ప్రభుత్వం స్పందించకపోతే.. మరో సకల జనుల సమ్మెకు దిగుతామని హెచ్చరిక
- సమ్మె నోటీసు ఇచ్చినా.. డిమాండ్లను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని మండిపాటు
- విధుల్లో చేరాలని మంత్రి పొన్నం, సంస్థ ఎండి విజ్ఞప్తి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల తొలిరోజు సమ్మె సక్సెస్ అయింది. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెతో.. బుధవారం ఉదయం బస్ డిపోల నుంచి బస్సులు బయటికి రాలేదు. కార్మికుల సమ్మె క్రమంలో ప్రభుత్వం ప్రైవేట్ డ్రైవర్లతో ఆర్టీసీ బస్సులు నడుపుతోంది. కొన్నిచోట్ల అద్దె బస్సులను కూడా తిప్పుతున్నారు. పోలీసుల బందోబస్తు మధ్య బస్సులను అధికారులు నడుపుతున్నారు. అయితే కండక్టర్లు అందుబాటులో లేకపోవడంతో డ్రైవర్లే టికెట్లు జారీ చేశారు. ప్రయాణికులు డ్రైవర్ దగ్గరికి వెళ్లి టికెట్ తీసుకోవాల్సి వచ్చింది. అయితే బస్సులో కండక్టర్లు లేకపోవడంతో పురుషులు టికెట్లు తీసుకోవడం లేదు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులో ఉండగా.. పురుషులు టికెట్లు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ కండక్టర్లు లేకపోవడం పురుషులు డ్రైవర్ల దగ్గరికి వెళ్లి టికెట్లు తీసుకోవడం లేదు. దీంతో పురుషులు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించారు. మరోవైపు ఆర్టీసీ సమ్మె చేస్తున్న జేఏసీ నేతలు.. ఉదయం హైదరాబాద్ లోని గన్ పార్క్ వద్ద నివాళులు అర్పించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే.. మిగతా 02లో

# తేలదు.. ఆగదు
## ఇప్పటి వరకు విచారణలే
### కూలేశ్వరం అంటున్న కాంగ్రెస్
### కాపాడేది అదే అంటున్న బీఆర్ఎస్




- రాజకీయ విమర్శలకే వేదిక
- అసలు నిజాలు ఎప్పుడో?
- రేవంత్ కు కేంద్రం మద్దతు
- కాళేశ్వరంపై ఒకే వాదన

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ గర్వకారణంగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు ఆ రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ఓవైపు వరుస కేసులు.. విచారణలు.. కోర్టు వాయిదాలు.. తీర్పులు మొత్తంగా రోజుకో తీరున కాళేశ్వరం వివాదం మండుతూనే ఉంది. తాజాగా హైకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం సుప్రీం కోర్టులో కేసు వేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. దీనికోసం నేడు జరిగే కేబినెట్లో కీలకంగా చర్చించనున్నారు. ఇదే సమయంలో కాళేశ్వరంపై బీఆర్ఎస్ కూడా స్పీడ్ పెంచింది. తెలంగాణకు అదే గర్వకారణమని, రాబోయే రోజుల్లో ఆకలి తీర్చే అన్నపూర్ణ అంటూ చెప్పుకుంటోంది. రెండు పార్టీలు రాష్ట్రంలో కొట్టుకుంటుంటే.. మధ్యలో బీజేపీ కూడా వంత పాడుతోంది. సీఎం రేవంత్ వ్యాఖ్యలకు మద్దతుగా ప్రకటన చేసింది. ఇటీవల రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎంపీలు కాళేశ్వరం ప్రస్తావన తీసుకువచ్చారు. వారికి ఇదే సరైన చాన్స్ అనిపించింది. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కాళేశ్వరం పేరుతో సుమారు లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం నీళ్లపాలైందని ఆయన కుండబద్దలు కొట్టారు. ప్లానింగ్, డిజైన్ లోపాల వల్లే బ్యారేజీలు కుంగిపోయాయని, ప్రజలకు అందాల్సిన నీరు అందకుండా పోయిందని కేంద్రం స్పష్టం చేయడం బీఆర్ఎస్ వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. దాంతో పార్లమెంట్లో అమరావతి అంశంపై చర్చలోతమ ఆక్రోశాన్ని వెలిబుచ్చారు.

**కూలేశ్వరం విమర్శలకు పెరిగిన బలం**

రేవంత్ రెడ్డి మొదటి నుండి కాళేశ్వరాన్ని కూలేశ్వరం అని పిలుస్తూ వస్తున్నారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లీకేజీలు బయటపడటంతో ఆయన చేస్తున్న విమర్శలకు ఇప్పుడు కేంద్ర మంత్రి వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూర్చాయి. లక్ష కోట్ల వ్యయం చేసినా ఫలితం శూన్యమని కేంద్రం సాక్షాత్తూ పార్లమెంటులో ప్రకటించడం ద్వారా.. ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ రెండు పార్టీలు బీఆర్ఎస్ హయాంలో అవినీతి జరిగిందని జాతీయ స్థాయిలో ముద్ర వేసినట్లయింది. ఇది బీఆర్ఎస్ నాయకత్వానికి మింగుడుపడని పరిణామంగా మారింది. ఇటు రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీల నిరసనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టును గత ప్రభుత్వం ఒక ఏటీఎం లాగా వాడుకుందని ఆయన విమర్శించారు. కేవలం కమీషన్ల కోసమే రీ–డిజైనింగ్ పేరుతో వేల కోట్లు అదనంగా ఖర్చు చేశారని విమర్శించారు. అమరావతికి అన్ని పార్టీలు మద్దతు ఇస్తున్న వేళ, బీఆర్ఎస్ సభ్యులు అనవసరంగా కాళేశ్వరం అంశాన్ని తెరపైకి తెచ్చి అబాసుపాలయ్యారని బీజేపీ నేతలు ఎద్దేవా చేస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో కూడా ప్రాజెక్టు వైఫల్యంపై చర్చ జరగడం బీఆర్ఎస్ ఇమేజ్‌ను బాగా దెబ్బతీసింది.

**విచారణ నీడలో ప్రాజెక్టు భవిష్యత్తు**

బ్యారేజీల కుంగుబాటుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇప్పటికే తీవ్రమైన లోపాలను ఎత్తిచూపింది. ఈ లోపాలపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని, అది నెమ్మదిగా సాగుతోందని మంత్రి పాటిల్ పేర్కొన్నారు. అటు రాష్ట్రంలో విజిలెన్స్ విచారణ, ఇటు కేంద్ర సంస్థల నివేదికలు బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మీద కాళేశ్వరం అంశం బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా పెద్ద అడ్డంకిగా మారింది. అటు కాంగ్రెస్ రాష్ట్ర స్థాయిలో, ఇటు బీజేపీ జాతీయ స్థాయిలో ప్రాజెక్టు వైఫల్యాన్ని ఎండగడుతుండటంతో ఆ పార్టీ సమాధానం చెప్పుకోలేక సతమతమవుతోంది. కేవలం ఒక బ్యారేజీ కుంగిపోవడమే కాకుండా, లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయిందనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్తోంది. దీనిని కవర్ చేసుకునే క్రమంలో చేస్తున్న ప్రయత్నాలు మరింత వివాదాలకు దారితీస్తుండటంతో గులాబీ దళం ప్రస్తుతం తీవ్ర నిర్వేదంలో ఉంది. మిగతా 02లో

## ఓటుకు నోటుపై
# రెండు వారాల తర్వాత విచారణ
### నిందితులు సీఎం రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య వేర్వేరుగా పిటిషన్లు

- అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల ప్రకారమే విచారణ చేయాలని సుప్రీంకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- ఈ కేసు నుంచి తన పేరును పూర్తిగా తొలగించాలని ఎమ్మెల్యే సండ్ర పిటీషన్



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. 2015లో తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో నమోదైన ఈ కేసుపై సుప్రీంకోర్టు బుధవారం విచారణ జరిపింది. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం మరో 2 వారాల పాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని స్పెషల్ బెంచ్ ఈ కేసుపై విచారణ జరిపింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యలు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేయగా.. దానిపై విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. జస్టిస్ జేకే మహేశ్వరి ఆధ్వర్యంలోని ప్రత్యేక ధర్మాసనం ఈ ఓటుకు నోటు కేసును విచారణ చేపట్టింది. ఈ ప్రత్యేక బెంచ్‌లో జస్టిస్ విజయ్ బిష్ణోయ్ కూడా సభ్యులుగా ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం 3:30 గంటలకు ఈ కేసులో రెండు కీలక పిటిషన్లను సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఇందులో ఒకటి సీఎం రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కాగా.. మరొకటి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేశారు.

**రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**

ఇక ఓటుకు నోటు కేసులో పిటిషన్ దాఖలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. దీన్ని అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల ప్రకారమే విచారణ చేయాలని సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. మిగతా 02లో

## రూ. 98వేల కోట్లతో రహదారుల నిర్మాణం
### 2028లోగా తెలంగాణలో దేశంలోనే అత్యుత్తమ రోడ్లు

నవంబర్‌లో హైటెక్స్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ 09

రాష్ట్రంలో రహదారుల నిర్మాణం, అభివృద్ధిపై సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



## ఖమ్మంలో ఎన్ఐఏ తనిఖీలు

సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్/ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావును విచారించిన అధికారులు 09

## టెస్కో ద్వారానే చేనేత వస్త్రాలు సేకరించాలి
### రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

- ప్రభుత్వ సంస్థలకు అవసరమైన దుస్తులు, బెడ్ షీట్లు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా సేకరించాలని సర్కార్ నిర్ణయం
- హైకోర్టును ఆశ్రయించిన వరంగల్ జిల్లాకు చెందిన వీరాంజనేయ హ్యాండ్లూమ్ వీవర్స్ సహా పలు సొసైటీలు

10




# ఉద్యోగాలు పోయాయి
### ఆర్టీసీ సమ్మె ఫలితం

- సెల్ఫ్ డిస్మిస్ చేసిన కేసీఆర్
- హైకోర్టు జోక్యం
- ప్రగతి భవన్ విందుతో సుఖాంతం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ఆర్టీసీ కార్మికుల సమస్యలు ఏ ప్రభుత్వం వచ్చినా కొనసాగుతూనే ఉన్నాయి. కార్మికులు ఆందోళనకు దిగడం, సమ్మె చేయడం.. ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం.. మళ్లీ ఉద్యోగాలకు రావడం పరిపాటిగానే మారింది. సమ్మె చేసినప్పుడల్లా ఏదో ఒక అంశమే స్పష్టంగా తెలుతోంది. కానీ, ప్రధాన డిమాండ్లు మాత్రం ముందుకు కదలడం లేదు. తాజాగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. తెలంగాణ రాజకీయ చరిత్రలో 2019లో జరిగిన ఆర్టీసీ సమ్మె ఒక పెను సంచలనం. కేసీఆర్ ప్రభుత్వానికి, కార్మిక సంఘాలకు మధ్య జరిగిన ఆ సుదీర్ఘ పోరాటం అనేక మలుపులు తిరిగింది. 2019, అక్టోబర్ 5న, సరిగ్గా దసరా పండుగకు ముందు రోజున మిగతా 02లో



## రివర్స్ టూరిజం
### పర్యాటక రంగంలో సరికొత్త ప్రయోగం

- ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించిన మంత్రి జూపల్లి
- హైదరాబాద్ పయనమైన 250 మంది అడవి బిడ్డలు

09






సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 23.04.2026
www.mudranews.in | @mudranews



**నిద్ర త్వరగా పట్టాలంటే..?**



నిర్దిష్ట టైమ్‌కు పడుకోవడం ప్రతి రోజు ఒకే సమయానికి నిద్రపోవడం అలవాటు చేసుకోండి. ఇది మీ బాడీ క్లాక్‌ను సెట్ చేసి త్వరగా నిద్ర పట్టేలా చేస్తుంది.

# తేలదు.. ఆగదు

( మొదటి పేజీ తరువాయి)

**అసలు ఏమవుతోంది..?**

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతాంగానికి వరమా? శాపమా? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. దాదాపు 36 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. లక్ష కోట్లు ఖర్చయింది. డిజైన్ మొదలు నిర్మాణం వరకు లోపాలతో 3 బ్యారేజీలు నిరుపయోగమయ్యాయి. వాటి రిపేర్లపై ప్రస్తుతం ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. 'ఉత్తర తెలంగాణ రైతాంగానికి జీవధార' అన్నది బీఆర్ఎస్ వాదన. కరప్షన్, కమిషన్లతో ప్రజాధనం దుర్వినియోగమైందన్నది కాంగ్రెస్ వాదన. ఎవరి వాదన ఎలా ఉన్నా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ మాత్రం ఈ ప్రాజెక్టు ఆలోచన మొదలు ప్రారంభోత్సవం వరకు అనేక లోపాలు జరిగాయని ఎత్తిచూపింది. 'కాగ్' సైతం ప్రజాధనం దుబారా జరిగిందని, ఆర్థిక నిర్వహణ అస్తవ్యస్థంగా ఉన్నదని విశ్లేషించింది. కాళేశ్వరం ప్రాజెక్టుతో సాగునీరు ఎంత అందిందనేది సమాధానం లేని మిలియన్ డాలర్ల ప్రశ్న. కానీ ప్రాజెక్టుకు ఖర్చు చేసిన లక్ష కోట్లలో దాదాపు 84 వేల కోట్ల అప్పులు రాష్ట్ర ఖజానాకు భారంగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు బ్యారేజీలు, టన్నెళ్లు, గ్రావిటీ కెనాళ్లు, రిజర్వాయర్లు, పంప్ హౌజ్‌లు, లిఫ్టులు.. అంటూ ఎన్ని చెప్పినా ఇప్పుడది అలంకారప్రాయమే. అవినీతి, అవకతవకలపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఎంక్వయిరీ కమిషన్ సుదీర్ఘ విచారణల అనంతరం నివేదిక ప్రభుత్వానికి చేరింది. కేసీఆర్, హరీశ్‌రావు, బ్యూరోక్రాట్లు, ఇరిగేషన్ అధికారులు, ఇంజినీర్ల తప్పిదాలను కమిషన్ ఎత్తిచూపింది. ప్రభుత్వం అరెస్టు చేస్తుందేమో.. చర్యలు తీసుకుంటుందేమో.. అనే ఆందోళనతో కేసీఆర్, హరీశ్‌రావు సహా నలుగురు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ, వాదనలు ముగిశాయి. తుది తీర్పు ఏప్రిల్ 22న వెలువడనున్నది. ఆగమేఘాల మీద హరీశ్‌రావు ఢిల్లీ వెళ్లి సీనియర్ న్యాయవాదులతో సంప్రదింపులు జరిపారు. హైకోర్టు తీర్పు ప్రతికూలంగా వస్తే సుప్రీంకోర్టులో సవాలు చేయాలనే కసరత్తు మొదలైంది.

**రాజకీయ అస్త్రమేనా..?**

కాళేశ్వరం ప్రాజెక్టు ఒకప్పుడు తెలంగాణ గర్వకారణంగా, అపర భగీరథ ప్రయత్నంగా ప్రచారమైంది. కానీ, మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లీకేజీలు బయటపడటంతో ఈ మెగా ప్రాజెక్టు ఇప్పుడు రాజకీయ పార్టీల మెడకు చుట్టుకున్న విషమ పరీక్షగా మారింది. ప్రాజెక్టులో అవినీతి జరగలేదని, అది కేవలం సాంకేతిక లోపమేనని నిరూపించుకోవాల్సిన అనివార్య పరిస్థితిలో బీఆర్ఎస్ ఉండగా, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీ మాత్రం ఈ అంశాన్ని కేవలం ఒక రాజకీయ అస్త్రంగానే వాడుకుంటున్నాయన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎం అని, అధికారంలోకి రాగానే విచారణ జరిపించి దోషుల నుంచి ప్రజాధనాన్ని కక్కిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అయితే, అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా విచారణ ప్రక్రియ ఆశించిన స్థాయిలో వేగవంతం కాలేదు. జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలోని కమిషన్ విచారణ సాగుతున్నప్పటికీ, ప్రభుత్వం సీబీఐ విచారణ కోరుతూ కేంద్రాన్ని కోరడం వెనుక తన బాధ్యతను కేంద్రంపైకి నెట్టివేసే వ్యూహం ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని ఏజెన్సీలతో పూర్తిస్థాయి క్రిమినల్ విచారణ జరపకుండా, కేవలం నివేదికలను కేంద్రానికి పంపి సైడ్ అయిపోవడంపై సామాన్య ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ కూడా కాళేశ్వరం అవినీతిపై భారీ ఎత్తున గళమెత్తింది. లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని సాక్షాత్తూ ప్రధాని, కేంద్ర మంత్రులు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు సిఫారసు చేసినా, కేంద్రం ఇంకా ఎందుకు రంగంలోకి దిగలేదన్నది ఒక మిస్టరీగా మారింది. విచారణ జరిపితే ఎక్కడ బీఆర్ఎస్ పట్ల సానుభూతి పెరుగుతుందో లేదా రాజకీయ సమీకరణాలు మారతాయో అన్న సందేహంతోనే బీజేపీ వెనకడుగు వేస్తోందా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. ఆరోపణలు చేయడం తప్ప, యాక్షన్ తీసుకోవడంలో కేంద్రం జాప్యం చేయడంపై విపక్షాలు ఇప్పుడు బీజేపీని టార్గెట్ చేస్తున్నాయి.

**బీఆర్ఎస్ ఆత్మరక్షణ**

మేడిగడ్డ కుంగుబాటు బీఆర్ఎస్‌కు పెను రాజకీయ సమస్యగా మారింది. ప్రాజెక్టు డిజైన్లలో లోపాలు ఉన్నాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలు స్పష్టం చేయడంతో, ఆ పార్టీ ఆత్మరక్షణలో పడింది. అయితే, ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ప్రాజెక్టును నిర్వీర్యం చేస్తోందని, మరమ్మతులు చేయకుండా కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ ఎదురుదాడి చేస్తోంది. కోట్లు ఖర్చు చేసిన ప్రాజెక్టును రాజకీయాల కోసం బలిపెట్టవద్దని, వెంటనే నీటిని నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**నిజాల కోసం ప్రజల నిరీక్షణ**

ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పార్టీ కూడా కాళేశ్వరంపై పూర్తిస్థాయి వాస్తవాలను బయటపెట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్లు కనిపించడం లేదు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కాలక్షేపం చేస్తున్నాయే తప్ప, అసలు దోషులు ఎవరు? ఆ సొమ్ము ఎక్కడికి పోయింది? మేడిగడ్డ ఎందుకు కుంగింది? అనే ప్రశ్నలకు శాస్త్రీయమైన సమాధానాలు ప్రజలకు అందడం లేదు. రాజకీయం ముసుగులో నిజాలు సమాధి అవుతున్నాయని సామాన్యులు భావిస్తున్నారు. కాళేశ్వరం కేవలం రాజకీయాల వేదిక కాకూడదు, అది ప్రజల ఆస్తి అనే స్పృహతో అన్ని పార్టీలు వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని డిమాండ్ చేస్తున్నారు.

# ఉద్యోగాలు పోయాయి

(మొదటి పేజీ తరువాయి)



ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పట్టారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి, జీతాల పెంపు వంటి 26 డిమాండ్లతో సుమారు 48 వేల మందికి పైగా కార్మికులు విధులను బహిష్కరించారు. పండుగ సమయంలో ప్రజలకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నా, తమ డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి తగ్గేది లేదని కార్మిక సంఘాల జేఏసీ భీష్మించుకూర్చుంది.

**కేసీఆర్ కఠిన నిర్ణయం సెల్ఫ్ డిస్మిస్**

సమ్మెపై అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత కఠినంగా స్పందించారు. ప్రభుత్వం విధించిన గడువు లోపు విధుల్లో చేరని వారందరూ తమంతట తామే ఉద్యోగాల నుంచి డిస్మిస్ అయినట్లు ప్రకటించారు. ఆర్టీసీలో కేవలం 1,200 మంది మాత్రమే ఉద్యోగులు మిగిలారని, మిగిలిన వారందరినీ తిరిగి తీసుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సమ్మె కాలంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ డ్రైవర్లను, కండక్టర్లను నియమించి బస్సులను నడిపింది. సుమారు 52 రోజుల పాటు సాగిన ఈ సమ్మెలో అనేక విషాదాలు చోటుచేసుకున్నాయి. ఉద్యోగాలు పోతాయన్న భయంతో, ఆర్థిక ఇబ్బందులతో సుమారు 25 మందికి పైగా కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడటం, గుండెపోటుతో మరణించడం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్రిక్తతలకు దారితీసింది.

ఈ వివాదం హైకోర్టుకు చేరింది. ఇరువర్గాలు చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని కోర్టు సూచించింది. కానీ, ప్రభుత్వం చర్చలకు మొగ్గు చూపలేదు. చివరికి, నవంబరు 25న కార్మిక సంఘాలు ఒక అడుగు వెనక్కి వేసి, ఎటువంటి షరతులు లేకుండా సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించాయి. తాము విధుల్లో చేరతామని చెప్పినప్పటికీ, ప్రభుత్వం వెంటనే వారిని అనుమతించలేదు, దీనితో మరో రెండు రోజులు సందిగ్ధత కొనసాగింది.

**ప్రగతి భవన్‌లో విందుతో సుఖాంతం**

నవంబరు 28న కేసీఆర్ తన వైఖరిని మార్చుకుని, కార్మికులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కార్మికులు నా బిడ్డలు, వారు యూనియన్ నాయకుల మాట విని తప్పుదారి పట్టారు అని పేర్కొంటూ వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ప్రగతి భవన్‌లో కార్మికులతో కలిసి భోజనం చేసి, ఆర్టీసీని నష్టాల నుంచి గట్టెక్కించే బాధ్యతను వారిపై పెట్టారు. అలా ఒక తీవ్రమైన పోరాటం ఊహించని విధంగా సుఖాంతమైంది.



# తొలిరోజు సమ్మె సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

మరో సకల జనుల సమ్మెకు రెడీ అవుతామని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న తీవ్ర హెచ్చరికలు చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ మినహా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలతోపాటు.. ఉద్యోగ, ప్రజా సంఘాలు కూడా ఈ ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపినట్లు చెప్పారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి తమను చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. తాము లేవనెత్తిన సమస్యలు, చేస్తున్న డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఇప్పుడు చేస్తున్న సమ్మెను మరింత తీవ్ర స్థాయికి తీసుకెళ్తామని హెచ్చరించారు. తాము సమ్మె నోటీసు ఇచ్చినా.. డిమాండ్లను నెరవేర్చకుండా కేవలం కాలయాపన కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ అధికారుల కమిటీ వేసిందని విమర్శలు చేశారు. తమకు కమిటీ అవసరం లేదని.. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని జేఏసీ ఛైర్మన్ డిమాండ్ చేశారు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛందంగా ఆర్టీసీ కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేసే ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మె ఆపేది లేదని స్పష్టం చేశారు. మందకృష్ణ మాదిగ, బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్య తమ సమ్మెకు మద్దతు ఇస్తున్నారని తెలిపారు. మరోవైపు.. ఆర్టీసీ సమ్మె కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించడంతో వారు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు.

**ఆర్టీసీ పరిరక్షణ, ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని సమ్మె విరమించండి : రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

తెలంగాణ గ్రామీణ ప్రాంతాల పేద ప్రజలకు లైఫ్ లైన్ ఆర్టీసీ అని రాష్ట్ర రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభివర్ణించారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ,ప్రజా శ్రేయస్సు కారణంగా ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ఆయన స్పందించారు.

ఆర్టీసీలో రోజుకు 65 లక్షల మంది ప్రయాణిస్తుండగా.. అందులో 40 లక్షల మంది మహిళా ప్రయాణికులు ఉన్నారని వివరించారు. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 అంశాలకు ప్రభుత్వం పరిష్కరించడానికి సిద్ధంగా ఉందన్న మంత్రి.. మిగిలిన మూడు అంశాలపై చర్చిస్తున్నట్లు చెప్పారు. తాము అధికారంలో రాగానే కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా సీనియర్ ఐఏఎస్ లతో మొట్ట మొదటి కమిటీ వేశామని చెప్పారు. అధికారుల కమిటీతో ఐదు గంటలపైగా చర్చిస్తుండగానే సమ్మెకు పోతున్నామని మధ్యలో వెళ్లిపోవడం ఇది కుట్రలో భాగమేనని పొన్నం అన్నారు. ఇటీవల జగిత్యాల సభలో మహాలక్ష్మీ ప్రయాణం గురించి కేసీఆర్ అవహేళనగా మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్టీసీపై కుట్రలో భాగంగానే గతంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడుగా ఉన్న హరీష్ రావు సమ్మెపై కార్మికులను ప్రోత్సహించారని ఆరోపించారు. మహాలక్ష్మీ పథకాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉప ముఖ్యమంత్రి రాష్ట్రంలో లేరన్న పొన్నం... ఆర్టీసీ డిమాండ్స్‌పై చర్చిస్తున్నామని చెప్పారు.. అయిన వినకూడనే ఎవరితో ఫోన్‌లో మాట్లాడి సమ్మెకి వెళ్ళారని జేఏసీ నేతలపై మండిపడ్డారు.. ఆర్టీసీ కార్మికులకు 2013 బాండ్స్ 280 కోట్లు ఇచ్చామని చెప్పారు. 1134 మందికి కారుణ్య నియామకాలు ఇచ్చామనీ. రాష్ట్ర రవాణా శాఖ పక్షాన పని భారం లేకుండా కార్మిక చట్టాలు లోపలే చేశామన్నారు. గతంలో 12 గంటలు వాహనం నడపడంతో మరునాడు హాఫ్ ఉండేదన్నారు. వాళ్ళు ఎలా అంటే అలా చేయడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి తెలిపారు. తామే పని భారం లేకుండా చేయాలని చూస్తున్నామన్న ఆయన శ్రమ దోపిడి చేయదలచుకోలేదన్నారు. విలీనం, యూనియన్ ల అంశాలపై ప్రభుత్వం పరిగణనలో ఉందని వివరణ ఇచ్చారు. ప్రభుత్వం నెలకి ఆర్టీసీకి రూ.300 కోట్లు, అవసరమైనప్పుడు రూ. 400 కోట్లు ఎంత అవసరం ఉంటే అంత ఇస్తోంచన్నారు. ఆర్టీసీలో సర్వీసు నుండి రిమూవ్ అయిన వారికి 250 మందికిపైగా ఉద్యోగాలు ఇస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

**మొండిపట్టు వీడండి : ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి**

ఆర్టీసీ కార్మికులు మొండిపట్టు వీడి, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి సూచించారు. బుధవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ప్రస్తుత పరిస్థితిని వివరించారు. ఆర్టీసీ అనేది సామాన్య ప్రజల రవాణా వ్యవస్థ అన్న నాగిరెడ్డి.., సమ్మె ద్వారా సంస్థను ప్రజల నుంచి దూరం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘాల తీరుతో సామాన్య ఉద్యోగులు ఇబ్బందుల్లో పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె కొనసాగుతున్నప్పటికీ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 25 శాతం బస్సులను నడుపుతున్నట్లు ఎండీ వెల్లడించారు. కార్మికులు పెట్టిన 32 డిమాండ్ల విలువ సుమారు రూ.35 వేల కోట్లుగా ఉందని, ఇది సంస్థపై భారీ భారాన్ని చూపుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు కార్మికులు లేవనెత్తుతున్న సమస్యలు కొత్తవి కావన్నారు. ఇవి ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నవని గుర్తుచేశారు. యూనియన్లు మొండి పట్టుదలతో వ్యవహరిస్తూ ఆర్టీసీ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆయన విమర్శించారు. ఉద్యోగులంతా సమ్మెను తక్షణమే విరమించి, ప్రభుత్వంతో చర్చల్లో పాల్గొనాలని నాగిరెడ్డి కోరారు. మొండివైఖరితో సంస్థ మనుగడనే ప్రశ్నార్థకం చేయవద్దని, విధి నిర్వహణలోకి రావాలని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక మూడోసారి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాతి నుంచి సమ్మె చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో బుధవారం తెల్లవారుజాము నుంచి తెలంగాణలో ఆర్టీసీ బస్సులు రోడ్లు ఎక్కలేదు. సమ్మె ప్రభావం ప్రయాణికులపై తీవ్రంగా పడుతోంది. ప్రజా రవాణాలో కీలకమైన ఆర్టీసీ సేవలు నిలిచిపోవడంతో.. గమ్య స్థానాలకు చేరుకోవడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలు ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగడానికి కారణాలేంటి? ప్రభుత్వం చేస్తున్న ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏంటనేది తెలుసుకుందాం.

**సమ్మె చేపట్టడానికి కారణాలు..**

ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేపట్టడానికి చాలా కారణాలే ఉన్నాయి. ఆర్టీసీ జేఏసీ 32 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచింది. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం, వేతన సవరణ చేపట్టడం, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలనేవి ప్రధానమైన డిమాండ్లు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారు. అదే తరహాలోనే ఇక్కడ కూడా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని తెలంగాణ ఆర్టీసీ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. తమను కూడా ప్రభుత్వ ఉద్యోలుగా గుర్తించాలని వారు కోరుతున్నారు. సంస్థలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని.. కారుణ్య నియామకాలు చేపట్టాలని.. కాంట్రాక్ట్, క్యాజువల్ కార్మికులను పర్మనెంట్ చేయాలనేవి కూడా వారి డిమాండ్లలో భాగంగా ఉన్నాయి.

ఉద్యోగుల జీతాల నుంచి కట్ చేసిన పీఎఫ్, సొసైటీ నిధులను ప్రభుత్వం తిరిగి ఆర్టీసీకి చెల్లించాలని.. పదవీ విరమణ బెనిఫిట్స్‌ను సకాలంలో అందజేయాలని ఆర్టీసీ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్టీసీ మనుగడకు కీలకమైన డ్రైవర్లు, కండక్టర్లపై ఒత్తిడి తగ్గించేలా డ్యూటీలు వేయాలని.. 8 గంటల పనిదినం అమలు చేయాలని వారు కోరుతున్నారు. మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంతోపాటు పని వేళల్లో వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు. చెకింగ్ అధికారుల వేధింపులు తగ్గించాలని.. అద్దె బస్సుల సంఖ్యను తగ్గించి సొంత బస్సులను పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కొన్నేళ్లుగా నిలిచిపోయిన కార్మిక సంఘాల ఎన్నికలను వెంటనే నిర్వహించి.. గుర్తింపు సంఘాన్ని ఎన్నుకునే అవకాశం కల్పించాలి. కాలం చెల్లిన పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులు కొనుగోలు చేయాలి. ఆర్టీసీ బస్సులకు డీజిల్ సబ్సిడీ అందించాలి. మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తోన్న ప్రభుత్వం.. దానికి సంబంధించిన నిధులను ఎప్పటికప్పుడు ఆర్టీసీకి విడుదల చేయాలని కార్మికులు కోరుతున్నారు.

విశ్రాంతి గదులను ఆధునికీకరించాలని.. వైద్య సదుపాయాలను మెరుగుపర్చాలని.. సమ్మె కాలంలో తొలగించిన ఉద్యోగులపై ఉన్న కేసులను ఎత్తివేయాలని కూడా ఆర్టీసీ జేఏసీ డిమాండ్ చేస్తోంది.

బుధవారం తెల్లవారుజాము నుంచి సమ్మెకు దిగుతామని ఆర్టీసీ జేఏసీ వారం క్రితమే ప్రకటించింది. అయినా సరే ప్రభుత్వం వెంటనే చర్చలకు సిద్ధం కాలేదని.. హడావుడిగా మంగళవారం సాయంత్రం నలుగురు ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేసి.. వారిని చర్చలకు ఆదేశించిందని కార్మికులు చెబుతున్నారు. ఆర్టీసీ ఉద్యోగులతో చర్చించిన ఈ కమిటీ డిమాండ్ల పరిష్కారానికి నాలుగు వారాల సమయం కావాలని కోరగా.. దానికి కార్మిక సంఘాలు అంగీకరించలేదు. దీంతో బుధవారం నుంచి ఆర్టీసీ సమ్మె మొదలైంది. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతోనే తాము సమ్మెకు వెళ్లాల్సి వచ్చిందని కార్మికులు చెబుతున్నారు. ప్రభుత్వం మాత్రం రెండు డిమాండ్లు మినహా మిగతా వాటి విషయంలో సానుకూలంగా ఉన్నామని చెబుతోంది.

**తెలంగాణ వచ్చాక మూడోసారి సమ్మె..**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఆర్టీసీ సిబ్బంది గతంలో రెండుసార్లు సమ్మె చేపట్టారు. వేతన సవరణ చేపట్టాలనే ప్రధాన డిమాండ్‌తో 2015లో 8 రోజులపాటు సమ్మె చేశారు. ప్రభుత్వం ఏకంగా 44 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడంతో సమ్మెను విరమించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే ప్రధాన డిమాండ్‌తో 2019 అక్టోబర్ 5 నుంచి నవంబర్ 25 వరకు 52 రోజులపాటు 48 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు సుదీర్ఘ సమ్మె చేశారు. కానీ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడంతో చివరకు ఎలాంటి లిఖితపూర్వక హామీ లేకుండా కార్మికులు విధుల్లో చేరారు. ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేపట్టినప్పటికీ కాంట్రాక్టు డ్రైవర్లు, తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్ల సాయంతో కొన్ని బస్సులను నడిపిన ప్రభుత్వం ప్రయాణికులు మరీ ఇబ్బంది పడకుండా జాగ్రత్తపడింది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం.. రాష్ట్రంలో ప్రస్తుతం 3100 అద్దె బస్సులు ఉన్నాయి. వీటితోపాటు 500 ఎలక్ట్రిక్ బస్సులు ఉన్నాయి. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ.. ఇవన్నీ యథావిధిగా రోడ్డెక్కుతాయి. తాతాల్కికంగా సిబ్బందిని నియమించుకొని, వారి సాయంతో మరో 2 వేల బస్సులను నడపాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇదే జరిగితే రాష్ట్రంలోని సగం ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రయాణికులకు సేవలు అందిస్తాయి. అయితే గతంతో పోలిస్తే ఆర్టీసీలో ప్రయాణించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. మహాలక్ష్మీ పథకం వల్ల ఆర్టీసీలో రోజువారీ ప్రయాణికుల సంఖ్య 35 లక్షల నుంచి 60 లక్షలకు చేరింది. ఇంత మందికి సాధారణ రోజుల్లో నడుపుతున్న ఆర్టీసీ సర్వీసులే సరిపోవడం లేదు. అలాంటిది సగం సర్వీసులు ఎలా సరిపోతాయనే ప్రశ్న తలెత్తుతోంది. గతంలో ఆర్టీసీ సమ్మె చేపట్టిన సమయంలో ఆటోలు, ట్యాక్సీలకు డిమాండ్ పెరిగింది. ఇదే అదనుగా వారు ఛార్జీలను విపరీతంగా పెంచేశారు. దీని వల్ల ప్రయాణికులపై భారం పడింది. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితే తలెత్తే అవకాశం ఉంది.

**సమ్మె ఎప్పుడు ముగుస్తుంది..?**

ఆర్టీసీ సమ్మె ఎప్పుడు ముగుస్తుంది అనే ప్రశ్నకు ఇప్పటికిప్పుడు కచ్చితమైన సమాధానం చెప్పలేం. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, వారి డిమాండ్ల పరిష్కారానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తే తక్కువ సమయంలోనే సమ్మె ఆగిపోవచ్చు. కానీ ప్రభుత్వం గనుక 2019 తరహాలో కఠిన వైఖరిని అవలంబిస్తే మాత్రం చాలా రోజులపాటు సమ్మె కొనసాగుతుంది. అయితే రేవంత్ రెడ్డి సర్కారు ఇప్పటి వరకూ ఉద్యోగులు, కార్మికుల విషయంలో సానుకూల ధోరణినే కనబరుస్తోంది. కాబట్టి ఇలా జరిగే అవకాశాలు తక్కువగానే ఉంటాయి.

రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల సమ్మె ఉధృత రూపం దాల్చుతోంది. ప్రభుత్వం, యాజమాన్యం తమ డిమాండ్లపై మొండిగా వ్యవహరిస్తున్నాయని ఆరోపిస్తూ ఆర్టీసీ జేఏసీ తదుపరి ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. సమ్మెలో భాగంగా నేడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, యూనిట్లు, వర్క్‌షాపుల వద్ద 'మహాధర్నా'లు నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చింది. ఏప్రిల్ 21న ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీతో జేఏసీ నాయకత్వం సుదీర్ఘంగా చర్చలు జరిపారు. 32 డిమాండ్లపై చర్చ జరిగినప్పటికీ, ప్రధాన సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం, యాజమాన్యం నుంచి స్పష్టమైన హామీ లభించలేదు. ఇప్పటికిప్పుడు సమస్యలు పరిష్కరించలేం అని అధికారులు చేతులెత్తేయడంతోనే విధిలేని పరిస్థితుల్లో సమ్మెకు దిగాల్సి వచ్చిందని జేఏసీ స్పష్టం చేసింది. కాగా సమ్మెను విజయవంతం చేస్తున్న ఆర్టీసీ కార్మికులను "ఉద్యమ పులిబిడ్డలు"గా సంబోధిస్తూ జేఏసీ నాయకత్వం వారికి అభినందనలు తెలిపింది. ప్రభుత్వం ప్రజలను, కార్మికులను తప్పుదారి పట్టిస్తోందని, న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం ఆపేది లేదని వారు హెచ్చరించారు. నేడు ఉదయం 5 గంటల నుంచే అన్ని డిపోల వద్ద మహాధర్నాలలో పాల్గొని నిరసన తెలపాలని కార్మికులను కోరారు.

**ప్రధాన డిమాండ్లు..**

–ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను పూర్తిస్థాయిలో విలీనం చేయాలి.

–2021 వేతన సవరణను 30 శాతానికి తగ్గకుండా అమలు చేయాలి.

–గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ బస్సులను రద్దు చేయాలి

–ఇతర జోన్లకు ఉద్యోగులను బదిలీ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి.

–కార్మిక సంఘాలను అనుమతించి, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి.

# ఓటుకు నోటుపై 2 వారాల తర్వాత విచారణ

(మొదటి పేజీ తరువాయి)

ఈ కేసును అవినీతి క్రిమినల్ కేసుగా కాకుండా.. ఎన్నికల ఉల్లంఘన కేసుగా పరిగణించాలని రేవంత్ రెడ్డి వాదించారు.

**సండ్ర వెంకట వీరయ్య పిటిషన్**

ఇక.. ఈ కేసులో మరో నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య.. ఈ కేసు నుంచి తన పేరును పూర్తిగా తొలగించాలని సుప్రీంకోర్టును కోరారు. తనపై వచ్చిన ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే రేవంత్ రెడ్డి, సండ్ర వెంకట వీరయ్యలు వేర్వేరుగా దాఖలు చేసిన రెండు పిటిషన్లను కలిపి విచారణ చేయాలని సుప్రీంకోర్టు తాజాగా నిర్ణయించింది. దీంతో ఈ కేసు ఇప్పుడు మరింత రసవత్తరంగా మారింది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
23.04.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### నిద్ర త్వరగా పట్టాలంటే.?

మొబైల్, స్క్రీన్ దూరం పెట్టడం పడుకునే ముందు కనీసం 1 గంట ఫోన్ వాడకాన్ని తగ్గించండి. బ్లూ లైట్ నిద్ర హార్మోన్‌ను తగ్గించి నిద్రను ఆలస్యం చేస్తుంది.





## ప్రభుత్వ విద్యపై పెరుగుతున్న నమ్మకం

- **రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి**

**ముద్ర, వెల్గటూర్:**

రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకువస్తున్న మార్పులతో విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యపై నమ్మకం పెరిగిందని, ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో రోజురోజుకీ ప్రవేశాల సంఖ్య పెరుగుతుందని రాష్ట్ర రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి మంత్రి సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలని లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకువస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం, సాంకేతిక విద్యను అందించడానికి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అంతేకాకుండా కాస్మెటిక్ చార్జీలను పెంచి ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం పెరిగిందని ఇందుకు ఆన్లైన్ ద్వారా వస్తున్న దరఖాస్తులే నిదర్శనమని మంత్రి తెలిపారు. సంక్షేమ హాస్టల్లో ఏలాంటి ఇబ్బందులు లేకుండా తమ వంతుగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.


## హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కు చెంపదెబ్బ

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతి ఆరోపణలపై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కక్షసాధింపు చర్యలకు గట్టి చెంపపెట్టు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా న్యాయస్థానాలు ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని ఆయన తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక అంశంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును కేటీఆర్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. తాము ముందు నుంచి చెబుతున్నట్లే.. అది పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కాదు, ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని అక్షరాల నిజమని తేలిపోయిందని ఎద్దేవా చేశారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న రేవంత్ తీరును హైకోర్టు తీర్పు ఎండగట్టిందని ఆయన అభిప్రాయపడ్డారు. సహజ న్యాయ సూత్రాలను విస్మరించి, నిబంధనలకు పాతరేశారని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ కారణాలతో రెండున్నరేళ్లుగా పడావు పెట్టారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి, రాష్ట్రంలోని అన్నదాతలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు స్పష్టం చేయడంతో, రాష్ట్ర ప్రభుత్వం పన్నిన రాజకీయ కుట్రలకు బ్రేక్ పడిందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా కక్షసాధింపు రాజకీయాలు పక్కన పెట్టి, ప్రాజెక్టు మరమ్మతులు పూర్తి చేసి రైతన్నలకు సాగునీరు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రభుత్వానికి కేటీఆర్ హితవు పలికారు.



## శ్రీ స్వామివారికి పాదపద్మార్చన సేవ

**ముద్ర, ప్రతినిధి యాదాద్రి భువనగిరి:**



స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో బుధవారం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య పాదారవిందములకు 108 బంగారు అష్టదళ పద్మ పుష్పాలతో అష్టోత్తర శతనామాలతో అష్టదళ పాదపద్మార్చన సేవ అర్చక స్వాములు ఘనంగా నిర్వహించారు. శ్రీభగవత్ రామానుజుల వారి 1009వ తిరునక్షత్ర మహోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రతిష్ఠితమైన వారి విగ్రహానికి శాస్త్రోక్తంగా అభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదమంత్రాల ఘోష మధ్య, పాలు, పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం సమర్పించగా, భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొని శ్రీభగవత్ రామానుజుల వారి కృపాకటాక్షాలను పొందారు.

విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు.

# కాళేశ్వరం దోషులు జైలుకే..

- **అవినీతి జరగలేదని హైకోర్టు చెప్పలేదు**
- **ఘోష్ కమిషన్ దర్యాప్తులో తప్పలను మాత్రమే ప్రస్తావించింది**
- **తీర్పును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత చర్యలు**
- **టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

**న్యూ ఢిల్లీ :**



కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందనడంలో ఎలాంటి అనుమానం లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఈ కుంభకోణానికి బాధ్యులైన దోషులు ఎప్పటికైనా జైలుకు వెళ్లడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన బుధవారం అక్కడ మీడియాతో మాట్లాడారు. ఘోష్ కమిషన్ దర్యాప్తు జరిపిన విధానంలో తప్పులను మాత్రమే హైకోర్టు ఎత్తి చూపిందన్నారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగింది వాస్తవమనీ అది ప్రజలకు తెలుసన్నారు. రూ. లక్ష కోట్లతో బిఆర్ ఎస్ కట్టిన ప్రాజెక్టు వారి హాయంలోనే కూలిపోయింది కుంగిపోయిందన్నారు.

ప్రోసీజర్ లాప్స్ ఉన్నాయమని మాత్రమే చెప్పిందన్నారు. దోషులను జైలుకు పంపించే ప్రక్రియ ఆగలేదని చెప్పారు. కొద్ది రోజులు ఆగవచ్చు కానీ జైలుకు పోవడం ఖాయమన్నారు. హైకోర్టు తీర్పు సిబిఐ దర్యాప్తునకు, మరో దర్యాప్తు కు కానీ అడ్డంకి కాదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి తదుపరి చర్యలకు పూనుకుంటుందన్నారు. కాళేశ్వరం విషయంలో బీజేపీ ద్వంద్వ నీతి అవలంబిస్తోందని విమర్శించారు. గతంలో ప్రధాని మోడీ, అమిత్ షా స్వయంగా కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్‌కు ఏటీఎంలా మారిందని అన్నారని గుర్తు చేశారు. దోషులను జైలుకు పంపుతామన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఇప్పుడు కేంద్రం చేత సీబీఐ దర్యాప్తు ఎందుకు చేయించడం లేదని ప్రశ్నించారు. బీజేపీ బీఆర్ఎస్ మధ్య ఉన్న రహస్య ఒప్పందంతోనే సీబీఐ విచారణ ముందుకు సాగడం లేదని ఆయన ఆరోపించారు. కోర్టు తీర్పును తాము గౌరవిస్తామని చెబుతూనే, విచారణ తీరుపై కీలక వివరణ ఇచ్చారు. హైకోర్టు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను, దాని విచారణను, నివేదికను తప్పుబట్టలేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం విధానపరమైన నిర్ణయాన్ని కోర్టు తప్పుబట్టిందని గుర్తు చేశారు.

## నాణ్యతే లక్ష్యం

- **బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.6.50 కోట్లు**
- **శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి**
- **త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు**

**ముద్ర, ఖమ్మం:**



ప్రభుత్వ పనుల్లో కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని, నాణ్యతతో కూడిన రహదారులను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని చింతపల్లి నుంచి ముత్తగూడెం వరకు రూ. 6.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ లోపే రహదారి పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గతంలోనే ముత్తగూడెం అభివృద్ధి కోసం రూ. 16.70 కోట్లు మంజూరు చేశామని, త్వరలోనే మున్సిపాలిటీ వ్యాప్తంగా మరిన్ని సీసీ రోడ్లు, డ్రైన్ల పనులు చేపడతామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని, త్వరలోనే రెండో విడత పంపిణీ ప్రక్రియను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, ప్రత్యేక అధికారి రమేష్, ఆర్&బి ఎస్ఈ యాకోబు, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**ప్రతిపక్షాల విమర్శల్లో వాస్తవం లేదు..**

సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో అర్థం లేదని, ఈ ప్రభుత్వం ఏ ఒక్క పథకాన్ని నిలిపివేసిందో వారు సమాధానం చెప్పాలని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో నగరం 1, 59, 60 డివిజన్లకు చెందిన 27 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు.

**రైతు పక్షపాతి మన ప్రభుత్వం**

రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. బుధవారం నేలకొండపల్లిలో నాచేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. మద్దతు ధరతో పాటు అదనంగా రూ. 500 బోనస్ చెల్లిస్తున్నామని ప్రకటించారు. రైతులు పండించిన పంటను విక్రయించిన వెంటనే, ఆలస్యం లేకుండా వారి ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నామని వివరించారు. పేదలకు ఇచ్చిన ప్రతి మాటను ప్రభుత్వం నెరవేరుస్తోందని పొంగులేటి స్పష్టం చేశారు. గత పాలకులు ఐదేళ్లలో చేయలేని రుణమాఫీని, తమ ప్రభుత్వం కేవలం ఆరు నెలల్లోనే రూ. 21 వేల కోట్లు విడుదల చేసి 25 లక్షల మంది రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేసిందని గుర్తు చేశారు. ప్రైవేటు రంగానికి దీటుగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కోల్డ్ స్టోరేజీలను నిర్మించి త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుల జారీ వంటి అనేక సంక్షేమ పథకాలను అప్పుల భారం ఉన్నప్పటికీ చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## హైకోర్టు తీర్పు సర్కార్ కు చెంపపెట్టు

- **కాళేశ్వరంలో అవినీతి సర్కార్ డ్రామా**
- **ఘోష్ కమిషన్ నివేదిక లోపభూయిష్టం**
- **మాజీ మంత్రి హరీశ్ రావు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ప్రజా సమస్యలను పక్కనపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి పేరిట డ్రామాలు ఆడిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ఆ కుట్రలు బట్టబయలయ్యాయని విమర్శించారు. ఇప్పటికైనా రాజకీయ దుష్ప్రచారం మానేసి, వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక అంశంలో బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పును హరీశ్ రావు స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు. అంతిమంగా ధర్మమే జయించిందని ఆయన పేర్కొన్నారు. 'సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మమే జయిస్తుందని మరోసారి నిరూపితమైందని వ్యాఖ్యానించారు. ప్రాథమిక హక్కులను, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ కమిషన్ విచారణ జరిపిందని, దీనిని ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టడం శుభపరిణామమని ఆయన అన్నారు. వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని కోర్టు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. ఎవరు అవునన్నా కాదన్నా... ముమ్మాటికీ కాళేశ్వరం తెలంగాణకు ప్రాణేశ్వరం అన్నారు.

## 25న చండీగఢ్‌లో మంత్రి అడ్లూరి పర్యటన

**ధర్మపురి/ హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ నెల 25న చండీగఢ్‌లో పర్యటించనున్నారు. కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 26న నిర్వహించనున్న "చింతన్ శివిర్" కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన వెళ్తున్నారు. మంత్రి పర్యటన దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చండీగఢ్ ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు అధికారిక సమాచారాన్ని అందజేశారు.

## పనులు వేగవంతం చేయాలి

- **సీతారామ పనులపై మంత్రి తుమ్మల సమీక్ష**

**ఖమ్మం, ఏప్రిల్ 22 :**

ఖమ్మం, ఏప్రిల్ 22 :
సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగమైన సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులను వేగవంతం చేసి రాబోయే వర్షాకాలానికి సత్తుపల్లి ఆయకట్టుకు గోదావరి జలాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం సత్తుపల్లి నియోజకవర్గంలోని యతలకుంటలో ఉమ్మడి జిల్లా అధికారులతో కలిసి, అశ్వరావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ముందుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టి పంపు నుంచి యతలకుంట వరకు సాగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులు అలసత్వాన్ని విడిచిపెట్టి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ప్రాజెక్టును నిర్దేశిత కాలంలో పూర్తి చేసి ఉభయ జిల్లాలను సస్యశ్యామలంగా మార్చగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాలి

- **భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**
- **ప్రాజెక్టులో అవకతవకలు జరిగినట్లు ఎన్డీఎస్ఏ స్పష్టం చేసింది**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి, గత ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగంపై సీబీఐ విచారణ జరిపించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కంటే ముందే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఈ ప్రాజెక్టులో అనేక అవకతవకలు జరిగినట్లు స్పష్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. బుధవారం గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా ప్రాజెక్టును నిర్మించిన అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నారని చెప్పారు. కాళేశ్వరం విషయంలో తెలంగాణ ప్రజలకు పూర్తి నిజానిజాలు తెలియాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో బీజేపీ నాయకులపై బాధ్యత మరింత పెరిగిందని ఎంపీ వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు చొరవ తీసుకుని ఈ కుంభకోణంపై సీబీఐ విచారణను వేగవంతం చేయాలని ఆయన కోరారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన దోపిడీ పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించి బాధ్యులను శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. పీసీ ఘోష్ కమిషన్ పై హైకోర్టు తీర్పు పూర్తి డాక్యుమెంట్ ఇంకా రాలేదన్నారు. ఘోష్ కమిషన్ రిపోర్ట్ ను కోర్టు ఎక్కడ తప్పుబట్టలేదని వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్ వాళ్లకు క్లీన్ చాట్ ఇవ్వడంపై బీజేపీ నేతలకు ఆనందం ఉందా అని నిలదీశారు. లేదంటే వెంటనే సీబీఐను దింపాలని డిమాండ్ చేశారు.హై కోర్టు ఒరిజినల్ ఆర్డర్ చూశాక న్యాయనిపుణులతో చర్చించి సాయంత్రం తమ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.రాష్ట్ర ఖజానాకు జరిగిన అన్యాయంపై తాము వెనకడుగు వేయమని చెప్పారు. హరీష్ రావు ఓవర్ కాన్ఫిడెన్స్ చూస్తే మొన్న ఢిల్లీ పర్యటన రిటర్న్ గిఫ్ట్ ఏమైనా వచ్చిందా! అనుమానం కలుగుతుందని అనుమానం వ్యక్తం చేశారు.హరీష్ రావు అప్పుడే జబ్బలు చర్చుకోలవసిన అవసరం లేదన్నారు.అవినీతి ఎంత జరిగింది అనేది సీబీఐ విచారణ చేస్తే తెలుస్తుందని వెల్లడించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
23.04.2026 గురువారం, హైదరాబాద్

## 4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com



# సూరీడుతో జాగ్రత్త..

## వడదెబ్బ తగిలే ముందు కనిపించే లక్షణాలు ఇవే.. లైట్ తీసుకుంటే ప్రాణాలకే ప్రమాదం..

ఎండలు దంచికొడుతున్నాయి.. 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో.. ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. తీవ్రమైన సూర్యరశ్మి, పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బ తగిలే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. ఇది ఒక తీవ్రమైన పరిస్థితి.. దీనిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం కావచ్చు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, ఎక్కువసేపు ఎండలో పనిచేసేవారు ముఖ్యంగా వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంది. శరీరం అధిక వేడిని తట్టుకోలేనప్పుడు, దాని సాధారణ పనితీరు ప్రభావితం కావడం మొదలవుతుంది. చాలాసార్లు, ప్రజలు ప్రారంభ లక్షణాలను చిన్నవిగా భావించి విస్మరిస్తారు. ఇది తీవ్రమైన అనారోగ్య పరిస్థితికి దారితీయవచ్చు. వడదెబ్బ తగిలే ముందు శరీరం కొన్ని ముఖ్యమైన సంకేతాలను ఇస్తుంది.. వాటిని అర్థం చేసుకోవడం చాలా కీలకం. అధిక చెమట, పెరిగిన శరీర ఉష్ణోగ్రత - బలహీనత వంటి మార్పులు క్రమంగా కనిపిస్తాయి. ఈ సంకేతాలను ముందుగానే గుర్తించడం సరైన చర్యలు తీసుకోవడానికి మనకు సహాయపడుతుంది. అందువల్ల, ఈ సమస్య పట్ల అప్రమత్తంగా ఉండటం.. శరీరం ఇచ్చే సంకేతాలను విస్మరించకపోవడం చాలా ముఖ్యం..

**వేసవిలో వడదెబ్బ తగలడానికి ముందు కనిపించే లక్షణాలు ఏమిటి?**

హెల్త్‌లైన్ ప్రకారం, వడదెబ్బ తగిలే ముందు శరీరం కొన్ని స్పష్టమైన సంకేతాలను ఇస్తుంది. వాటిని గుర్తించడం ముఖ్యం.

మొదటి లక్షణం తీవ్రమైన తలనొప్పి, కళ్ళు తిరగడం, ఇవి శరీర ఉష్ణోగ్రత పెరగడాన్ని సూచిస్తాయి.

రెండవది, తీవ్రమైన నీరసం - అలసట వల్ల పనులు చేసుకోవడం కష్టమవుతుంది. శరీరం నిస్తేజంగా అనిపిస్తుంది.

మూడవదిగా, అధికంగా చెమట పట్టడం, లేదా కొన్ని సందర్భాల్లో అకస్మాత్తుగా చెమట పట్టడం ఆగిపోవడం, శరీర ఉష్ణోగ్రతపై నియంత్రణ కోల్పోవడాన్ని సూచించవచ్చు.

అంతేకాకుండా, చంచలత్వం, ఆందోళన, నోరు పొడిబారడం, ఏకాగ్రత లోపం కూడా సంభవించవచ్చు. కొంతమందికి తేలికపాటి జ్వరం కూడా రావచ్చు.

ఈ సంకేతాలను నిర్లక్ష్యం చేస్తే, పరిస్థితి మరింత తీవ్రంగా మారవచ్చు.

**దీన్ని ఎలా నివారించాలి?**

వడదెబ్బ తగలకుండా ఉండాలంటే, తీవ్రమైన సూర్యరశ్మికి గురికాకుండా ఉండటం ముఖ్యం.. ముఖ్యంగా ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉండే మధ్యాహ్నం వేళల్లో.. బయట ఉన్నప్పుడు, మీ శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి మీ తలను కప్పుకోండి. తేలికైన, వదులుగా ఉండే కాటన్ దుస్తులను ధరించండి. పుష్కలంగా నీరు తాగి, శరీరాన్ని డీహైడ్రేట్ కాకుండా చూసుకోండి.

కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం వంటి పానీయాలు తాగడం శరీరాన్ని చల్లబరచడానికి సహాయపడుతుంది. ఎక్కువసేపు ఎండలో ఉండకుండా, తరచుగా నీడలో విశ్రాంతి తీసుకోండి. మీరు తప్పనిసరిగా బయట పని చేయాల్సి వస్తే, తరచుగా విరామం తీసుకోవడం ముఖ్యం.

**ఇది కూడా అవసరం**

వేసవి కాలంలో మీ దినచర్య, ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం ముఖ్యం. మీ శరీరంపై అధిక ఒత్తిడిని నివారించడానికి, తేలికైన, తాజా, పోషకమైన భోజనం చేయండి.. అలాగే ఎక్కువగా వేయించిన ఆహారాలకు దూరంగా ఉండండి. మీ ఇంటిని చల్లగా ఉంచుకోవడానికి ప్రయత్నించండి.. వేడిచేసిన, మూసివున్న ప్రదేశాలలో ఎక్కువసేపు గడపడం మానుకోండి.మీ శరీరంలో ఏవైనా అసాధారణ మార్పులను నిర్లక్ష్యం చేయవద్దు. మీకు బాగా అసౌకర్యం కలిగితే, సకాలంలో చికిత్స అందేలా, తీవ్రమైన సమస్యలను నివారించేలా వెంటనే వైద్యుడిని సంప్రదించండి.

# జ్ఞాన ప్రదాయిని; అక్షర విజ్ఞాన స్వరూపిణి!!

నిశ్శబ్దపు గదిలో నినదించే గళం పుస్తకం..
ముడుచుకున్న కాగితాల్లో విచ్చుకున్న ప్రపంచం పుస్తకం!
కనురెప్పల చాటున కలలని నిజం చేసే మంత్రం..
మమకారాన్ని, విజ్ఞానాన్ని పంచే అక్షర క్షేత్రం!


ముద్రించిన అక్షరం కేవలం సిరా చుక్క కాదు,
అది అజ్ఞానపు అడవిని దహించే అగ్ని కణం!
పుస్తకం చదవడం అంటే నిన్నటి అనుభవాన్ని పలకరించడం,
రేపటి గమ్యానికి నేడే పునాది వేసుకోవడం.
కోటి మాటలు చెప్పలేని సత్యాన్ని ఒక పేజీ చెబుతుంది,
లోకం చూపని దారిని ఒక వాక్యం చూపిస్తుంది.

జ్ఞాన సముద్రానికి పుస్తకమే ఏకైక నావ..
విజ్ఞాన దాహానికి అది అక్షరాల వెన్నెల దీవ!

పుస్తకం పట్టిన చేయి ఎప్పుడూ వణకదు,
అక్షరం నేర్చిన మెదడు ఎప్పుడూ అలిసిపోదు.
చదివిన ప్రతి మాట ఒక విజ్ఞాన కిరణం,
సాధించబోయే విజయానికి అది తొలి చరణం!
పుస్తకం ఒక నేస్తం.. వీడని అనుబంధం..
విజ్ఞానానికి అది నిరంతర ఆనంద నిలయం!


(నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం)

జటావత్ రాజు (యువ కవి, రచయిత)
తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్
9347196264.




## ప్రభుత్వ ఉద్యోగానికి ప్రిపేర్ అవుతున్నారా

# ఈ తప్పులు చేయకండి



డిగ్రీ లేకుండా జీవితం సులభం, కాని డిగ్రీతో జీవితం సులభం కాదు. ఈ మాటలు బహుశా అర్థమై వుంటాయని అనుకుంటున్నాను. ఏ అర్హత లేకపోతే ఏదైనా చేసుకొని బ్రతుకొచ్చు. కానీ మీకంటూ ఓ అర్హత, డిగ్రీ, పీ.జి పీ.హెచ్ లాంటి పట్టా ఏదైన తీసుకున్న తర్వాత మీ దగ్గర వున్న అర్హతల ఆధారంగా ఉద్యోగం అన్వేషించుకోవడం అనేది భగీరథ ప్రయత్నం లాంటిదే. అంతెందుకు మీ దగ్గర డిగ్రీ పట్టాతో మీరు ఎన్ని రకాల ఉద్యోగాలకు అర్హులో మీకు తెలుసా? తెలిస్తే మీరసలు ఆ పట్టాను అలా వృథాగా దుర్వినియోగం చేస్తారా? మనదేశంలో జరిగే సివిల్ సర్వీసెస్ లాంటి పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహించే ప్రతిష్టాత్మక పరీక్షలకు డిగ్రీ పట్టానే అర్హతగా వుంటుందని ఎంత మందికి తెలుసు. ఒక వేళ తెలిసినా అది చాలా జటిలమైనా/క్లిష్టమైన పరీక్షగా భావించి దానికి దూరంగా జరిగి దాని జోలికే పోరు.

దీనికి సంబంధించిన ఒక చక్కని ఉదాహరణ చెప్తాను. ఓ విద్యార్థి డిగ్రీలో కాంబినేషన్గా ఎకనామిక్స్, హిస్టరి, పొలిటికల్ సైన్సు తీసుకున్నాడని అనుకుందామ్. ఈ మూడు సబ్జెక్టుల సిలబస్ దాదాపుగా ఉభయ తెలుగు రాష్ట్రాలు నిర్వహించే గ్రూప్1, గ్రూప్2 లాంటి పరీక్షల సిలబస్ ను డిగ్రీలోనే ఆ విద్యార్థి చదువుతాడు. ఇక కొత్తగా చదవాల్సింది ఏమిటి జనరల్ స్టడీస్ కి ఆ అభ్యర్థి ప్రిపేర్ అవ్వాల్సి వుంటుంది. అసలు ఇందులో చరిత్ర, భూగోళశాస్త్రం, అర్థశాస్త్రం, జనరల్ సైన్సు, రాజనీతి శాస్త్రం, వర్తమాన విషయాలు (కరెంట్ అఫైర్స్) అలాగే అర్థమెటిక్, రీజనింగ్, మెంటల్ ఎబిలిటి మొదలైన వాటి నుండి 150 ప్రశ్నలు, 150 మార్కులకి ఉంటుంది. ఈ అంశంలో అభ్యర్థికి కలిసొచ్చేవి మళ్ళీ చరిత్ర, రాజనీతి శాస్త్రం, అర్థశాస్త్రం ఇక కొత్తగా చదవాల్సినవి జనరల్ సైన్సు, వర్తమాన విషయాలు, అర్థమెటిక్, రీజనింగ్ అంటే ఇవి కాక 75 మార్కులకు అనుకున్నా 75 మార్కులు తను చదివే సిలబస్లో వున్నప్పుడు అధనంగా మరో 75 మార్కుల సిలబసన్ను చదవలేరా చెప్పండి. అంటే ఈ అభ్యర్థి సక్సెస్కు ఎంత దగ్గరగా వున్నాడో లోతుగా ఆలోచిస్తే మీకే అర్థం అవుతుంది. కానీ ఈ దిశగా అభ్యర్థులు ఆలోచించరు. అంటే వారు చేసే అశ్రద్ధయే వారి భవిష్యత్తును అలాగే జీవితాన్ని తారుమారు చేస్తుంది.

ఇక సైన్సు గ్రాడ్యుయేట్స్ గురించి వారు చేసే తప్పుల గురించి ఒక మాటలో చెప్పి నేరుగా విషయంలోకి వస్తాను. సైన్సు కాంబినేషన్లతో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ లేదా ఇతర కాంబినేషన్లు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రి, బయోటెక్నాలజీ, బయో కెమిస్ట్రి, మైక్రోబయలాజీ మొదలైన కాంబినేషన్లతో మీరు డిగ్రీ పూర్తి చేశారు. మీరు గ్రూప్1, గ్రూప్2 లేదా మీకు సివిల్ సర్వీసెస్ లాంటి పోటీ పరీక్షలు వ్రాసి మంచి ఉన్నతమైన ఉద్యోగం, ఉన్నతమైన స్థానంలో ఉండాలని అనుకుంటున్నారు. మీరు డిగ్రీలో చదివిన బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ మొదలైన సిలబస్కు సంబంధించిన ప్రశ్నలు గ్రూప్1, గ్రూప్2, సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలో 2025 మార్కులకు ప్రశ్నలు వుంటాయన్న వాస్తవం మీకు తెలుసా? ఇక అర్థమెటిక్, రీజనింగ్ విషయంలో మీరు కొంచెం పట్టుసాధిస్తే వాటికి 20 25 మార్కులు ఉంటాయని కూడా మీకు తెలియదు. అంటే మీరు పోటి పరీక్షల ప్రపంచంలో మీ స్థానం ఎలా వుందో ఒకసారి ఆలోచించండి. ఎలాంటి యుద్ధవ్యూహాలు తెలియకుండానే మీరు ఒకవేళ యుద్ధభూమిలోకి వెళ్ళాల్సి వస్తే వెళ్ళి యుద్ధం చేస్తారా? మరి పరీక్ష గది కూడా మీరు మానసికంగా చేయాల్సిన యుద్ధభూమి లాంటిదే కదా. అంటే 150 మార్కుల పేపర్లో 75 మార్కులు మీకు అనుకూలంగా వున్నాయి. మిగితా 75 మార్కులు మీరు కష్టపడిన దానిని బట్టి మీ 'సక్సెస్' ఆధారపడి వుంటుదనేది కఠిన వాస్తవం. దీనిని మీరు అంగీకరించినా. అంగీకరించకపోయినా ఇదే నిజం. ఇక సివిల్స్, గ్రూప్స్ లాంటి ఉద్యోగాలను పక్కన పెట్టి మీలో ఎవరైనా పోలీస్ ఉద్యోగం మీద ఆసక్తి వుండి దానికి మీరు ప్రిపేరు అవ్వాలని అనుకుంటున్నారు. అసలు దాని గురించి దాని యొక్క సెలక్షన్ విధానం మీద గతంలో వచ్చిన ప్రశ్నల సరళి మీద, గతంలో సక్సెస్ ఐన వారితో నేరుగా కాంటాక్ట్ అయ్యి పరీక్షల విధానం మెళుకువలు, ప్రిపరేషన్, మంచి పుస్తకాల సేకరణ మొదలైన అంశాల గురించి తెల్సుకోవాలి. లేని పక్షంలో మీకు మీరుగా ప్రిపేర్ అవ్వాలి అనుకుంటే కొన్ని తప్పులు జరిగే అవకాశం వుంటుంది. ఒకసారి ఉద్యోగాలకు సంబంధించిన వ్రాత పరీక్షలో పొరపాట్లు చేసి, ఉద్యోగాన్ని చేజేతులతో దూరం చేసుకుంటే మళ్ళీ అదే అవకాశం వెంటనే వస్తుందని ఆశించడం అత్యాశే అవుతుంది. అప్పటి వరకు శారీరక మానసిక స్థాయిలు ఎలా మారుతాయన్నది, అలాగే మళ్ళీ నోటిఫికేషన్ నాటికి మీకు వయస్సు అర్హత ఉండొచ్చు, ఉండకపోవచ్చు. అలాగే రెండవసారి పరీక్ష వ్రాసేటప్పుడు మొదటిసారి విఫలమైన సందర్భాలు పదే పదే మిమ్మల్ని వెంటాడి మానసికంగా ఇబ్బంది పెడతాయి. అంటే మీ మానసిక స్థాయిలు ఎలా ప్రభావితం అవుతున్నాయో తెల్సుకోండి. కాబట్టి వచ్చిన మొదటి అవకాశాన్నే చివరి అవకాశంగా భావించి ప్రణాళిక బద్ధంగా సమయాన్ని సద్వినియోగం చేసుకొని, విషయ నిపుణుల పర్యవేక్షణలో వారి సలహాలు సూచనలు పాటించి ముందుకు వెళ్ళాలి.

ఇక ఎస్.ఐ ప్రాథమిక పరీక్షలో అడిగే అంశాలు ఏమిటో ఒకసారి చూద్దాం. అర్థమెటిక్, టెస్ట్ ఆఫ్ రీజనింగ్, మెంటల్ ఎబిలిటి 100 ప్రశ్నలు మరియు జనరల్ స్టడీస్కు సంబంధించిన 100 ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో వుంటాయి. మొత్తం 200 మార్కులు, సమయం మూడు గంటలు ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగా మీ రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా మిమ్మల్ని ప్రిలిమినరి పరీక్షలో అర్హులను చేస్తారు. కాబట్టి ఇక మీ సన్నద్ధతే మిమ్మల్ని విజేతగా నిలుపుతుందని గమనించాలి.

ఇక చివరి అంకం మీలో ఎవరికైనా బ్యాంకింగ్ ఉద్యోగాల మీద ఆసక్తి వున్నట్లయితే ముందుగా ఆ పరీక్షకు ఉండాల్సిన ప్రాథమిక అర్హతలు చూద్దామ్. డిగ్రీలో 60% మార్కులతో పాసుకావాలి.

**ప్రిలిమినరి పరీక్ష సమయం 60 ని||లు**

| విభాగం | ప్రశ్నలు | మార్కులు |
|---|---|---|
| ఇంగ్లీష్ లాంగ్వేజ్ | 30 | 30 |
| న్యూమరికల్ ఎబిలిటి | 35 | 35 |
| రీజనింగ్ ఎబిలిటి | 35 | 35 |

మొత్తంగా అభ్యర్థి 100 మార్కులలో చూయించిన ప్రతిభ ఆధారంగా ఎంపిక ఉంటుందనేది అందరికి తెలిసిన విషయమే. ఈ పరీక్ష క్లర్క్ ఉద్యోగానికి సంబంధించినదిగా గమనించాలి.

ఇక సివిల్ సర్వీసెస్కు సంబంధించిన ప్రిలిమినరి పరీక్షకు సంబంధించిన పేపర్1, 200 మార్కులు, 2 గంటల సమయం, ఇందులో వర్తమాన అంశాలు, జాతీయ, అంతర్జాతీయ మరియు స్థానిక ప్రాధాన్యత కల్గినవి వుంటాయి.

చరిత్రకు సంబంధించి భారతదేశ చరిత్ర, అలాగే జాతీయోద్యమం, భారతదేశ, ప్రపంచ భూగోళ శాస్త్రము, ఫిజికల్, సోషల్, ఎకానమిక్, జాగ్రఫీ ఆఫ్ ఇండియా మరియు ప్రపంచం గురించిన ప్రశ్నలు, భారత ప్రభుత్వం రాజకీయాలు, రాజ్యాంగం, పంచాయతీరాజ్ విధానం, ప్రభుత్వ విధానాలు, హక్కులు మొదలైనవి, అర్థశాస్త్రము, సామాజిక అభివృద్ధి, సుస్థిరాభివృద్ధి, పేదరికం, జనాభా సామాజిక విభాగాలు, జనరల్ ఇష్యూస్, ఎన్విరాన్మెంట్, ఎకాలజీ, జీవవైవిధ్యము మరియు జనరల్ సైన్సు, పర్యావరణ మార్పులు, మొదలైన వాటి గురించి రెండు వందల ప్రశ్నలు వుంటాయి.

పేపర్2, 200 మార్కులు, సమయం 2 గంటలు.

Comprehension

Interpresonal skills & Including communication skills

Logical reasoning and analytical ability

Decision Making and problem solving

General Mental Ability

Basic numerical (number and their relation orders of magnitude etc. (class X level) Data interpretation chartsgraphs, tables, data, sufficiency etc. (class X level).

పైన తెలిపిన రెండు ప్రశ్న పత్రాలలో మీరు చూయించిన మార్కుల ఆధారంగా మీ రోస్టర్ రిజర్వేషన్ ఆధారంగా మెయిన్స్కు మిమ్మల్ని ఎంపిక చేస్తారు. ఇక మెయిన్స్ పేపర్ల గురించి ఇందులో వివరిస్తే వ్యాసం నిడివి పెరుగుతుంది. కాకపోతే ఒక విషయం గుర్తుంచుకోవాలి. అభ్యర్థులు మొదటిసారి సివిల్స్ లేదా ఏదైన గ్రూప్1/2 ఏదైన ఉద్యోగానికి సంబంధించినది కావొచ్చు. గతంలో రాసిన వారికి అనుభవం, అవగాహన వుంటాయి. అలాంటి వారితో మీరు పోటీపడాల్సి వస్తుంది. కాబట్టి వారికి కూడా మొదటిసారి వ్రాసి పరీక్షలో చేసిన పొరపాట్ల వల్ల కొంత ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. లేదా ఈ సారి ఖచ్చితంగా ఉద్యోగం సంపాదించాలనే కసి, పట్టుదల అధికంగా వుంటుంది. ఈ విషయంలో మాత్రమే వారు మీ కన్న ముందుంటారు. కానీ అంతిమంగా అభ్యర్థుల ప్రీపరేషన్ ఆత్మవిశ్వాసం, ఆరోగ్యం, మానసిక స్థాయిలు, మీరు సేకరించిన విలువైన పుస్తకాలు, మీరు తీసుకన్న కోచింగ్, మీరు సిద్ధం చేసుకున్న నోట్సు, పరీక్షకు ముందు రాసిన మాక్టస్టులు, గతంలో విజయం సాధించిన వారు ఇచ్చిన సలహాలు, సూచనలు వాటిని మీరు ఏ మేరకు పాటించారో సెల్ఫ్ చెక్ చేసుకోవాలి. మాక్ టెస్టులు రాసినప్పుడు ఎన్ని మార్కులు వస్తున్నాయి, ఎక్కడ వెనుకబడుతున్నారో, ఏఏ అంశాల్లో మీరు ఇంకా శ్రద్ధ కనబర్చాల్సివుందో మీకు తెలిసిపోతుంది. కాబట్టి మీ ప్రిపరేషన్కు ఇంకాస్త మెరుగులు దిద్దుకోండి, చిన్న చిన్న తప్పులే పరీక్ష గదిలో మిమ్మల్ని విజయం (సక్సెస్) నుండి దూరం చేస్తాయి. కాబట్టి అలాంటి పొరపాట్లను ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదు.


ఈ సందర్భంగా నాకు జరిగిన ఓ అనుభవం చెప్తాను 201011 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంలో గ్రూప్1 నోటిఫికెషన్ వచ్చింది. నేను అప్పటికి ఉస్మానియా విశ్వవిద్యాలంలో పీహెచ్.డి పరిశోధక విద్యార్థిగా అక్కడే గ్రూప్స్‌క్ ప్రిపేర్ అవుతున్నాను. ప్రిలిమ్స్ వ్రాసి అర్హత సాధించాను, అదే సమయంలో జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి అర్హత సాధించటం వల్ల మెయిన్స్పై శ్రద్ధ పెట్టలేకపోయాను. ఫలితంగా జూనియర్ లెక్చరర్ ఉద్యోగమే వచ్చింది. కానీ గ్రూప్1 మిస్సయ్యాను, దాని ఫలితం మళ్ళీ ఇటీవలే జరిగిన విషయం మీకు తెలిసినదే. (2024 2025) అంటే మళ్ళీ నోటిఫికేషన్ వచ్చినప్పటికి ఎంత సుదీర్ఘమైన సమయం పట్టిందో (దాదాపు 13 సం||రాలు) ఓసారి ఆలోచించండి. ఈ దశాబ్దంలోగా మీ కుటుంబంలో జరిగే మార్పులు, మీలో వచ్చే మానసిక శారీరక మార్పులు ఎలా ఉంటాయో ఆలోచించండి. అందుకే నిరుద్యోగ అభ్యర్థులు తరగతి గదిలో వున్నప్పుడే సమాంతరంగా పోటీపరీక్షల కోసం ప్లాన్ చేసుకొని అసలు మీరు ఎటు వెళ్ళాలని అనుకుంటున్నారో, అందుబాటులో వున్న, ఆర్థిక, కుటుంబపరమైన వనరులు ఏం వున్నాయో పరిశీలించుకోండి. మీరు పెట్టుకున్న 'లక్ష్యం' దాని తాలూకు మార్గాలు ఎలా చేరుకోవాలో మీకు అందుబాటులో వున్న మీ అధ్యాపకులను, లేదా కెరీర్ గైడెన్స్ ఇచ్చేవారిని అగడండి. వారి సలహాలు సూచనలు పాటించండి. గుడ్డిగా స్వంత నిర్ణయాలు తీసుకొని నాసిరకమైన మెటీరీయల్, కోచింగ్ సెంటర్లను ఆశ్రయించి మీ విలువైన సమయాన్ని కాలాన్ని వృథా చేయకండి. ఈ సందర్భంగా 12th Fail సినిమా చూశారు కదా! లేకపోతే చూడండి. అందులో కొన్ని పొరపాట్లు చేసి చివరికి సివిల్స్ విజేత అవుతాడు. హీరో. అంటే ఇక్కడ పరీక్ష ఏదైనా కావొచ్చు. పొరపాట్లు సహజంగా భయంతోనో, అవగాహన లోపంతోనో, అనుభవం లేకపోతేనో చేస్తామ్.

కాబట్టి అటువంటి లోపాలను మాక్టస్టులు రాసేటప్పుడు సెల్ఫ్ చెక్ చేసుకోవాలి. నిత్యం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, ఆత్మవిశ్వాసం తోణికిసలాడే విధంగా ముఖంపై చెరగని చిరునవ్వుతో కనిపించాలి. ఈ సారి ఖచ్చితంగా విజయం సాధిస్తామని దైర్యాన్ని ప్రదర్శించాలి. అది మీలో అడుగడుగునా వుట్టిపడేలా వుండాలి. నిరాశ, నిస్పృహలకు, భయం, ఆందోళన మొదలైన వాటికి దూరంగా వుండాలి. మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రతీరోజు దినపత్రికలు, పోటీ పరీక్షలకు సంబంధించిన మాస పత్రికలు (ఉదా: ఆర్.సి.రెడ్డి, వివేక్, షైన్ఇండియా, విజేత కాంపిటీషన్, యోజన, సెంట్రల్ ఎంప్లాయిమెంట్ న్యూస్, కాంపిటీటివ్ సక్సెస్ రివ్యూ) మొదలైనవి ఖచ్చితంగా ఫాలోకావాల్సి వుంటుంది. అలాగే గతంలో వచ్చిన ప్రశ్న పత్రాలు అవి ఏఏ అధ్యాయాలు, విభాగాలకు సంబంధించిన, ప్రశ్నలో విశ్లేషించే పట్టు సంపాదించాలి అలాగే జాతీయ, అంతర్జాతీయ, వర్తమాన అంశాలపై పట్టు పెంచుకోవాలి. ఒకవేళ ఎక్కడైన మీరు బలహీనంగా వున్నారని అనిపిస్తే వాటి మీద ఎక్కువ శ్రద్ధపెట్టాలి. వాస్తవానికి ఈ అంశం అన్ని పోటీ పరీక్షలకు వర్తిస్తుంది అన్న అంశం మరువకూడదు.

ఒకవేళ మీరు ఏదైనా కోచింగ్ సెంటర్లో జాయిన్ అయితే శ్రద్ధగా నోట్సు వ్రాసుకొని, వారు పెట్టే వారంతపు పరీక్షలు, మాస పరీక్షలు, వ్రాసినప్పుడు మీ ప్రతిభా సామార్థ్యాలు ఎంతమేరకు వున్నాయో అర్థం అవుతుంది. కాబట్టి అందులో మీకు వచ్చిన మార్కులు 8090% గా వుంటే మీరు విజయానికి దగ్గరలో వున్నారని గమనించాలి. అంతేకాని అదే అతిగా నమ్ముకొని ప్రిపేరేషన్ వదులుకోవద్దు, అశ్రద్ధ ఎట్టి పరిస్థితులలో కూడా చేయవద్దు. ఒకవేళ మార్కుల విషయంలో ఏదైనా వెనుకబడి వున్నా భయపడిపోయి ప్రిపరేషను ఆపవద్దు. ఇంకాస్తమెరుగైన ప్రిపరేషన్ చేస్తే ఖచ్చితంగా రానిస్తారు. కాబట్టి అభ్యర్థులుపైన చెప్పిన అంశాలు, చిట్కాలను పాటించి మీరు కోరుకుంటున్న ఉద్యోగం ఏదైన దానికి సంబంధించిన పరీక్ష వ్రాసి విజయం సాధిస్తారని ఆశిస్తూ...

ఈ వ్యాసం ఇటీవలే విడుదలైన (మీ ఆలోచనలే మిమ్మల్ని నిర్దేశిస్తాయి వ్యక్తిత్వ వికాసం - కెరీర్ గైడెన్స్ బుక్ నుండి )

డా. మహమ్మద్ హాసన్
అసిస్టెంట్ ప్రొఫెసర్
కెరీర్ కౌన్సిలింగ్ కోచ్
చరవాణి :
9908059234



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 23.04.2026
www.mudranews.in | @mudranews



## నిద్ర త్వరగా పట్టాలంటే.?



కెఫీన్ తగ్గించ డంసాయంత్రం తర్వాత టీ, కాఫీ తీసుకోవ డ ం తగ్గించండి.ఇవి నిద్రను దూరం చేస్తాయి మరియు మెదడును యాక్టివ్‌గా ఉంచుతాయి.

## సంక్షిప్తంగా..

### పది ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్ :** ఒకేరోజు పది ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాన్ని డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఘనంగా నిర్వహించి, పేదల సొంతింటి కలలను నిజం చేశారు. పేద కుటుంబాలకు సురక్షిత నివాసం కల్పిస్తూ వారి జీవితాల్లో కొత్త ఆశలను నింపారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం కస్తూర్బా బాలికా విద్యాలయం జూనియర్ కళాశాల నూతన భవనాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తో కలిసి ప్రారంభించారు. నూతన సీసీ రోడ్లను ప్రారంభించారు. గ్రామ మహిళా సంఘం భవనం, అంగన్వాడీ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తెల్కపల్లి మండల అధ్యక్షుడు బండ పర్వతాలు, సర్పంచ్ స్వామి, ఉప సర్పంచ్ రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ శివరెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ వెంకటయ్య గౌడ్, నరేందర్ గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు శ్రీకారం



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** మాడ్గుల మండలంలో బుధవారం కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆర్కపల్లి ఉన్నత పాఠశాల నుంచి పల్గుతాండ వరకు రూ. 1.05 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ, సిసి రోడ్లకు శంఖుస్థాపన చేశారు. అనంతరం కొత్తబ్రాహ్మణపల్లి, పాత బ్రాహ్మణపల్లి, మాడ్గుల గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను ప్రారంభించారు. తరువాత మధ్యాహ్నం 12 గంటలకు మాడ్గుల వాసవీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 214 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ పథకం కింద చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతనిధులు, నాయకులు హాజరయ్యారు.

### చెరువుల సుందరీకరణ వేగవంతం



**ముద్ర, కాప్రా:** నాచారం డివిజన్‌లో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న దోమల సమస్య పరిష్కారానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇప్పటికే రూ.30 కోట్ల నిధులతో హెచ్‌ఎంటీ నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులకు ఆమోదం లభించగా, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. అలాగే గుర్రపుడెక్క, పూడికతో నిండిపోయిన పటేల్ కుంట చెరువును శుభ్రపరిచి సుందరీకరించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. చిన్న చెరువు కావడంతో తక్కువ వ్యయంతోనే పనులు పూర్తి చేయవచ్చని వివరించగా, కమిషనర్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే పటేల్ కుంట చెరువు సుందరీకరణ పనులు ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాల్గొని, చెరువుల అభివృద్ధి ద్వారా ప్రజలకు ఉపశమనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మోగిన ఆర్టీసీ సమ్మె సైరన్

* డిపోలకే పరిమితమైన బస్సులు
* గద్వాలలో ప్రారంభమైన ఆర్టీసీ సమ్మె
* స్తంభించిన రవాణా
* ప్రయాణికుల ఇక్కట్లు
* భారీగా మోహరించిన పోలీసులు



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో విలీనం చేయాలి, 2021 పీఆర్సీని అమలు చేయాలి, కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలి మరియు బకాయి ఉన్న పీఎఫ్, సీసీఎస్ నిధులను విడుదల చేయాలి 32 ప్రధాన డిమాండ్ల పరిస్కారం కొరకు ఆర్టీసీ సమ్మె సైరన్ మోగించింది. మంగళవారం ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. ఆర్టీసి జేఏసీ పిలుపు మేరకు తమ డిమాండ్లను పరిష్కారించాలంటూ కోరుతూ బుధవారం గద్వాల ఆర్టీసీ డిపో ముందు కార్మికులు కార్మికులు, ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే మరో సకల జనుల సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అధికార పార్టీ మినహా అన్ని రాజకీయ పార్టీలు, ఉద్యోగ, ప్రజా సంఘాలు కూడా తమ సమ్మెకు మద్దతు తెలిపాయని వెల్లడించారు. తక్షణమే ప్రభుత్వం తమను చర్చలకు ఆహ్వానించి, సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ ఉద్యమం తీవ్ర స్థాయిలో కొనసాగుతుందని స్పష్టం చేశారు

**డిపోలకు పరిమితమైన బస్సులు**

గద్వాల డిపోలో మొత్తం 110 ఆర్టీసి బస్సులు ఉండగా వాటిలో ప్రభుత్వం 58, 52 ప్రైవేటు బస్సులున్నాయి. బుధవారం తెల్లవారుజామున నుంచి బస్సులు డిపోకు పరిమితం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ప్రయాణాలు చేశారు.

**భారీగా మొహరించిన పోలీసులు**

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో గద్వాల ఆర్టిసి బస్టాండ్లో ముందస్తుగా సీఐ టి.శ్రీను, గద్వాల ఎస్ఐ కళ్యాణ్ రావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ సునీత ఆదేశాల మేరకు పోలీస్ పహారాలో ప్రైవేటు డ్రైవర్ల సహాయంతో ఆర్టీసి బస్సులు నడిపారు. ప్రైవేటు బస్సులు మాత్రమే డిపోల నుంచి బయటకు కదులుతున్నాయి.

**కుషాయిగూడ డిపో వద్ద కార్మికుల ధర్నా**





**ముద్ర, కాప్రా:** హైదరాబాద్ పరిధిలోని కుషాయిగూడ ఆర్టీసీ డిపో వద్ద తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు కార్మికుల సమ్మె బుధవారం ఉదయం నుంచే ఉధృతంగా కొనసాగుతోంది. డిపో నుండి బస్సులను బయటకు పంపే ప్రయత్నం చేయగా, కార్మికులు అడ్డుకుని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు తిరుమలరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే తేదీని తక్షణం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే పీఆర్సీ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. .ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి, జేఏసీతో చర్చలు జరిపి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

# సమ్మె నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

**జిల్లా యంత్రాంగం అప్రమత్తం**
**కలెక్టర్ బాదావత్ సంతోష్**



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లాలో ఆర్టీసీ కార్మికుల సమ్మె ప్రభావం నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సమ్మె కారణంగా సాధారణ రవాణా సేవలు దెబ్బతినే అవకాశమున్నందున, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. బుధవారం నాగర్ కర్నూల్ డిపోను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. డిపోలో అందుబాటులో ఉన్న బస్సుల సంఖ్య, నడుస్తున్న రూట్లు, ప్రయాణికుల రద్దీ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామీణ మరియు సుదూర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ప్రయాణ సౌకర్యాలు నిరంతరంగా కొనసాగడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని అన్నారు. సమ్మె పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రజల అవసరాలు దెబ్బతినకుండా ఉండేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేయాలని చెప్పారు. ప్రయాణికుల సంఖ్యను అంచనా వేసి, అవసరానికి అనుగుణంగా బస్సుల రాకపోకలను పెంచాలని ఆదేశించారు. ఆర్టీసీ సిబ్బంది సమ్మెలో పాల్గొంటున్న పరిస్థితుల్లో సేవలు నిలిచిపోకుండా ఉండేందుకు ప్రైవేటు డ్రైవర్లు, కండక్టర్లను తాత్కాలికంగా నియమించాలని సూచించారు. వీరిని నియమించే సమయంలో సరైన ప్రమాణాలు పాటించడంతో పాటు, తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులు లేని, పూర్తి ఆరోగ్యవంతులైన డ్రైవర్లను మాత్రమే నియమించాలని స్పష్టం చేశారు. ప్రైవేటు సిబ్బంది విధుల్లో పాల్గొనే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ భద్రత కల్పించాలని ఆదేశించారు. ప్రయాణికుల్లో భయం లేకుండా, నమ్మకంతో ప్రయాణించే వాతావరణం కల్పించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. జిల్లాలోని నాగర్ కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట డిపోల నుండి ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సులు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. అవసరమైతే ప్రైవేటు బస్సుల యజమానులతో సమన్వయం చేసుకుని అదనపు సర్వీసులను అందుబాటులోకి తేవాలని సూచించారు. అనంతరం ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తో కలిసి ఆర్టీసీ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన ఈ సమావేశంలో ఆర్టీవోలు, డీఎస్పీలు, డిపో మేనేజర్లు పాల్గొన్నారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను సానుకూలంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని కార్మికులకు స్పష్టంగా తెలియజేసి, అనవసర ఆందోళన లేకుండా సమన్వయం కలిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తాత్కాలికంగా నియమితులయ్యే డ్రైవర్లు, కండక్టర్లకు పూర్తి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. వారు విధులు నిర్వర్తించేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పోలీస్ శాఖ సహకరిస్తుందని తెలిపారు. తాత్కాలిక సిబ్బందిపై ఎవరైనా దుశ్చర్యలకు పూనుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా రవాణా సేవలు సజావుగా సాగేందుకు శాంతి భద్రతలను కట్టుదిట్టం చేస్తామన్నారు.

# డిపోకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు



**ముద్ర, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాం డూర్ ఆర్టీసీ డిపోలో మంగళవారం అర్ధరాత్రి నుండి ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ బస్సులు సైతం కదలక డిపోకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమ తమ గమ్య స్థానాలకు చేరేందుకు ప్రైవేట్ వాహనాల్లో బయలుదేరారు. ప్రయాణికులు లేక బస్ స్టేషన్ బోసిపోయింది. ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగడంతో బస్ స్టేషన్ తో పాటు పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్మికులకు ప్రజా సంఘ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు సోమశేఖర్, జేఏసీ చైర్మన్ అంజిలయ్య, పిడిఎస్ యు వికారాబాద్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యర్థాలతో సంపద సృష్టిద్దాం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ఉత్పత్తి అయ్యే ప్రతి వ్యర్థాన్ని సక్రమంగా వినియోగించు కుంటే అది సంపదగా మారుతుందని, అలాగే పట్టణం పరిశుభ్రంగా మారడమే కాకుండా కుటుంబా లకు అదనపు ఆదాయం కూడా లభిస్తుందని మునిసిపల్ చైర్పర్సన్ తీగల సునేంద్ర పేర్కొన్నారు. నాగర్ కర్నూల్ నిర్వహించిన పర్యావరణ వారోత్సవాల సందర్భంగా "వ్యర్థాల నుండి సంపద – చెత్త కాదు అది కాసుల గుట్ట" అనే నినాదంతో రూపొందించిన అవగాహన కరపత్రాన్ని చైర్ పర్సన్, వైస్ చైర్మన్ బాదం రమేష్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంటింటి వ్యర్థాలైన కూరగాయల తొక్కలు, పండ్ల తొక్కలు, వాడిన టీ పొడిని ఒక పాత్రలో వేసి కొద్దిగా మట్టి కలిపితే సుమారు 40 రోజుల్లో నాణ్యమైన సేంద్రీయ ఎరువు తయారవుతుందని తెలిపారు. ఈ ఎరువును మిద్దె తోటలు, కుండీలలో పెంచే మొక్కలకు ఉపయోగిస్తే కూరగాయల ఖర్చు గణనీయంగా తగ్గుతుందని వివరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పాత న్యూస్ పేపర్లతో కవర్లు తయారు చేసుకోవాలని, అలాగే వాడిన నూనె డబ్బాలు, ప్లాస్టిక్ బాటిళ్లను పారేయకుండా పుదీనా, కొత్తిమీర, మిరప వంటి మొక్కలను పెంచేందుకు ఉపయోగించాలని సూచించారు.

# మల్లికార్జున ఖర్గే చిత్రపటం దహనం



**ముద్ర, తాండూర్:** ప్రధాని మోడీపై వ్యక్తిగతంగా టెర్రరిస్టుగా పోర్చుతూ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అనుచిత వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తూ బుధవారం తాండూర్ అంబేద్కర్ చౌక్ వద్ద ఖర్గే చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్ కుమార్, తాండూర్ పట్టణ బిజెపి ఫ్లోర్ లీడర్ నాగారం మల్లేశం మాట్లాడుతూ ప్రధాని మోదీపై చేసిన వ్యాఖ్యలకు భేషరతుగా మల్లికార్జున ఖర్గే క్షమాపణలు చెప్పాలని లేని పక్షంలో కర్గే ఇంటిని ముట్టడించేందుకు సైతం వెనుకాడమని హెచ్చరించారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాండూర్ పట్టణ బిజెపి నాయకులు డిమాండ్ చేశారు.

# విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి ప్రభుత్వ లక్ష్యమని డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణలో సంక్షేమ వారోత్సవాల సందర్భంగా బుధవారం నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెలకపల్లి మండలం రాకొండ కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం రూ. కోటి 54 లక్షల వ్యయంతో నిర్మించిన ఆధునిక సదుపాయాలతో కూడిన అదనపు తరగతి గదులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ మరియు పేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. కేజీబీవీలు, గురుకులాలు వంటి విద్యాసంస్థలను బలోపేతం చేయడం ద్వారా సమాన విద్యా అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి, అన్ని వర్గాల విద్యార్థులకు సమాన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి రాజీ ఉండదని, ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటున్నామనీ తెలిపారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు సదుపాయాల అభివృద్ధిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని చెప్పారు. సంక్షేమ వారోత్సవాల భాగంగా విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులపై దృష్టి పెట్టామని, జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో 1000 మార్కులకు గాను 990 మార్కులు సాధించిన విద్యార్థిని అనిషాను కలెక్టర్, ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. అనంతరం గ్రామ పరిధిలోని ఇందిరమ్మ లబ్ధిదారుల కోసం నిర్మించిన ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కలను సాకారం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, మండల విద్యాధికారి, అధికారులు, ప్రత్యేక అధికారి హసీనా, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** ఆరుగాలం కష్టపడి పండించిన రైతుల ధాన్యం వడ్ల కొనుగోలు కేంద్రాల్లో పోశారనీ, అయితే నేటికీ ప్రభుత్వ యంత్రాంగం కొనుగోలు ప్రారంభించక పోవడం రైతాంగాన్ని తీవ్రంగా నిరాశపరుస్తోందని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బాసు హన్మంతు నాయుడు అన్నారు, మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు కేటిదొడ్డి మండలంలో పంట పొలాలను, కొండాపురం గ్రామంలో కొనుగోలు కేంద్రంలో తడిచిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు చక్రధర్ రావు, అల్వాల్ పాడు ప్రతాప్‌రెడ్డి, మోనేష్ మారోజు, భరత్ సింహ్మారెడ్డి, సుభాష్ రెడ్డి, నక్క రవి, వీరేష్ రెడ్డి, కావలి గోపి, గోనెలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# పరుమాల గ్రామంలో గుప్త నిధుల కలకలం



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** గద్వాల మండలం పరుమాల గ్రామంలో గుప్త నిధులు తవ్వకాలు కలకలం రేపాయి. పరమాల గ్రామ శివారులో ఉన్న శ్రీ రంగస్వామి ఆలయ అవరణలో ఉన్న శివలింగం, వినాయక విగ్రహాల కింద గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపినట్లు బుధవారం గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఈ ఆలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు గ్రామస్తులు ఆరోపించారు. సుమారు నాలుగు అడుగుల లోతు గుంతను తవ్వారు. అధికారులు, పోలీసులు విచారణ చేపట్టి తవ్వకాలకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న గద్వాల సీఐ టి.శ్రీను, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను పట్టుకుంటామని సీఐ టంగుటూరి శ్రీను తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 23-04-2026
www.mudranews.in | @mudranews



## నిద్ర త్వరగా పట్టాలంటే..?

### ప్రశాంతమైన వాతావరణం



బెడ్‌రూమ్‌ను నిశ్శబ్దంగా, చీకటిగా ఉంచండి. ఇది మెదడుకు "ఇప్పుడు విశ్రాంతి సమయం" అనే సిగ్నల్ ఇస్తుంది.


## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



- మంత్రి లక్ష్మణ్ కుమార్

ముద్ర, గొల్లపల్లి:

ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లె గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని అన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించామని తెలిపారు. మధ్యవర్తుల దోపిడీ లేకుండా రైతులకు నేరుగా లాభం చేకూరే విధంగా కొనుగోలు కేంద్రాల్లో చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ముద్ర, కోరుట్ల;

పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోరుట్ల పట్టణంలోని జీఎస్ గార్డెన్ లో బుధవారం సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 316 మంది లబ్ధిదారులకు రూ. 1 కోటి 5 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిందని, కేసీఆర్ పాలన కేవలం విధ్వంసానికి, అవినీతికి నిలయంగా మారిందని విమర్శించారు. ఇటీవల జగిత్యాలలో జరిగిన సభలో కేసీఆర్ పాత విషయాలనే ప్రస్తావించడం ఆశ్చర్యకరమని అన్నారు.

ఈ కార్యక్రమంలో కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్‌లు తిరుమల వసంత, మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ షాహిద్ ఏఎంసీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్ గౌడ్, కొంతం రాజం, నాయకులు అన్నం అనీల్, నేమూరి భూమయ్య, కౌన్సిలర్లు తోట గంగాధర్, పుప్పాల ప్రభాకర్, దాసరి రాజ శేఖర్, వెంకటేష్ గౌడ్, గుండోజీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకానికి లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

రాబోయే వన మహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు సంబంధిత శాఖల అధికారులు తగు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని కలెక్టర్ అభిలాష అధికారులను ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమం కింద మొక్కలు నాటేందుకు ముందస్తు ప్రణాళికలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ, పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి, ఎక్సైజ్, మున్సిపల్, తదితర శాఖల ఆధ్వర్యంలో నాటే మొక్కలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గతంలో నాటిన మొక్కల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి శాఖ ఆధ్వర్యంలో వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటాలన్నారు. మొక్కల పెంపకానికి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, ఎక్సైజ్ అధికారి ఎంఎ. రజాక్, డిఈఓ భోజన్న, జెడ్పి సీఈవో భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గడీ ఖాళీ స్థలాల పరిరక్షణ దీక్షకు మద్దతు

ముద్ర, కోరుట్ల;

కోరుట్లలో గడి బురుజుల ఖాళీ స్థలాల పరిరక్షణ కోసం అఖిలపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు రెండవ రోజు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. బుధవారం దీక్షకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఎండి.మోసిన్, పొట్ట సురేందర్, ఎండి. ముజఫర్ అహ్మద్ సజ్జు, సయ్యద్ ఆన్వర్ లు సంఘీభావం తెలిపారు. అధికార కాంగ్రెస్ పార్టీ గడి స్థలాల విషయంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఇకనైనా స్పందించి వీఎల్టీలు రద్దు చేయాలని కోరారు. అంతకుముందు బీజేపీ నాయకులు కూడా మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ప్రజా సంఘాల కో కన్వీనర్ లు తుమ్మనపల్లి శ్రీనివాస్ బాబు, సుతారి రాములు, సయ్యద్ అన్వర్, తదితరులు పాల్గొన్నారు.




## ఆర్టీసీ జేఏసీ సమ్మె విజయవంతం







- సంఘీభావం తెలిపిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

ముద్ర ప్రతినిధి, జగిత్యాల:

ఆర్టీసీ కార్మికులు మంగళవారం అర్ధ రాత్రి నుంచి సమ్మెకు దిగారు. జగిత్యాల జిల్లాలోని మూడు డిపోల పరిధిలో కార్మికులు డిపోల ఎదుట బుధవారం ఉదయం ధర్నా నిర్వహించి తమ నిరసనలు తెలియజేశారు. జిల్లాలోని మూడు డిపోల్లో నుంచి సుమారు 250 బస్సులు బయటకు వెళ్లలేదు. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీ అద్దె సర్వీసులను నడిపించిన అవి సరిపోక ఇబ్బందులు తప్పలేదు. డిపోల ఎదుట ధర్నా నిర్వహించిన కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సమ్మెకు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తమ మద్దతును ప్రకటించారు. ఈ మేరకు జగిత్యాల డిపో ఎదుట బీజేపీ, టీఆర్ఎస్ నాయకులు వేరువేరుగా ధర్నా నిర్వహించి కార్మికు లకు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావా వసంత సురేష్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### కోరుట్లలో..

ముద్ర, కోరుట్ల;

ఆర్టీసీ జేఏసీ తలపెట్టిన సమ్మె విజయవంతమైంది. కోరుట్ల డిపో ఉద్యోగులందరూ బుధవారం సమ్మెలో పాల్గొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, యూనియన్ల పునరుద్ధరణ, పెండింగ్ పిఆర్సీలు, అలాగే 32 డిమాండ్ల పైన, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆర్టీసీ గురించి పెట్టిన అంశాలను నెరవేర్చాలని ప్రభుత్వానికి సమ్మె నోటీస్ అంద జేశారు. దీంతో ప్రభుత్వం జేఏసీ నాయకులతో సమావేశం ఏర్పరిచి చేసిన చర్చలు విఫలం కావడంతో సమ్మె చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల డిపో ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ సమ్మెతో ప్రజల ఇక్కట్లు

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగటంతో జిల్లా వ్యాప్తంగా రవాణా స్తంభించి పోయింది. ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. తమ సమ్మె నేపథ్యంలో ఆర్టీసీ సిబ్బంది డిపో ఎదుట నిరసనలు వ్యక్తం చేశారు. సమ్మెతో నిర్మల్ డిపోలో 156, భైంసా డిపోలో 75 బస్సులు డిపోకే పరిమితమయ్యాయి.




## బీజేపీ ఆధ్వర్యంలో 'ఖర్గే' దిష్టిబొమ్మ దహనం





ముద్ర, కోరుట్ల, కథలాపూర్;

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని తీవ్రవాది అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన ఏఐసీసీ జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిష్టి బొమ్మను కోరుట్లలో, కథలాపూర్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా కోరుట్ల పట్టణ శాఖ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మినారాయణ మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వయసు ఎక్కువ కావడంతో మతి భ్రమించి నోటికి ఏది వస్తే అది మాట్లాడడం సరికాదని అన్నారు. ఖర్గేని మంచి హాస్పిటల్ లో చూపించాలని, ఏఐసీసీ పదవి నుండి తొలగించాలన్నారు. ఇకనైనా బీజేపీ గురించి, నాయకులు గురించి నోటికొచ్చింది మాట్లాడితే కాంగ్రెస్ నాయకుల ఇళ్లముందు వారి దిష్టి బొమ్మలను ఇలాగే దహనం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ కోరుట్ల పట్టణ కౌన్సిలర్స్ కలాల రాధ సాయిచంద్, సోరుపాక రమాదేవి రమేష్, గుగ్లావత్ శ్రీకాంత్, తిరుమల వాసు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజేందర్, గిన్నెల శ్రీకాంత్, మాడవేణి నరేష్, పోతుగంటి శ్రీనివాస్, నాయకులు తుక్కారం గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు పంచారి విజేయ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి రాజు, బీజేపీ బీజేవైఎం నాయ కులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.1.29 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

నిర్మల్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో రూ.1.29 కోట్లు వ్యయామయ్యే అభివృద్ధి పనులకు ఎంఎల్ఏ ఏలేటి మహేశ్వర్ రెడ్డి భూమిపూజ చేశారు. సోన్ మండలం జాఫ్రాపూర్ లో రూ.63.5 లక్షలతో సరస్వతి డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పునరుద్ధరణ పనులకు, సంగంపేటలో రూ.66.4 లక్షల విలువైన చెరువు తూము అలుగు మరమ్మత్తులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే రైతులకు మేలు చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి, గంగన్న, మాజీ ఎంపీపీ హరీష్ రెడ్డి, సర్పంచులు రాజు రెడ్డి, మారీ విలాస్, మల్లేష్, నరేష్, నర్సారెడ్డి, నర్సారెడ్డి, రాజేశ్వర్, భూమా రెడ్డి,



ప్రశాంత్, గంగారెడ్డి, మక్కన్నతో పాటు వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం

- జిల్లా విద్యాధికారి భోజన్న

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్న అన్నారు. అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే సందర్భంగా జాతీయ గ్రీన్ కోర్ సంస్థ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు "భూమిని కాపాడుకుందాం", "ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం", "పచ్చదనం పెంచుదాం" వంటి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీఈవో భోజన్న మాట్లాడుతూ అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే పక్షాన్ని జరుపుకోవాల్సిన అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. భూమిని సంరక్షించడం అందరి బాధ్యత అని, చిన్నచిన్న చర్యల ద్వారా కూడా పర్యావరణాన్ని కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీరజరాణి, ఎన్ జి సి జిల్లా




సమన్వయ కర్త మోహన్ రావు, సెక్టోరల్ అధికారి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు, కృష్ణ, వివేక్, భూమన్న, విద్యార్థులు పాల్గొన్నారు.



## శ్రీ వాసవి మాత ఉత్సవాలకు కలెక్టర్ కు ఆహ్వానం

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

ఈ నెల 26న నిర్వహించనున్న వాసవి మాత జన్మదిన వేడుకలకు రావాల్సిందిగా కలెక్టర్ అభిలాష అభినవ్ కు ఆర్యవైశ్య సంఘ నేతలు ఆహ్వానం అందజేశారు. ఈ ఆహ్వానానికి కలెక్టర్ అంగీకరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఆమెడ శ్రీధర్, గంప అనిల్, పోలిశెట్టి శైలేష్, పాల్దె మహేందర్ తదితరులున్నారు.

## నూతన నియామకం

ముద్ర, కోరుట్ల:

కోరుట్ల మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గా బీజేపీ పార్టీకి చెందిన రుద్ర సుజాత, పార్టీ విప్ గా కలాల సాయి చంద్ రాధ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా ఇందూరి తిరుమల వాసు, సెక్రటరీగా గుగ్లవత్ శ్రీకాంత్ ను నియమించినట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు తెలిపారు. నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్ష్యుడు రాంచంద్ర రావు, ఎంపీ ధర్మపురి అర్వింద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. అనూప్ రావు, జిల్లా అధ్యక్ష్యుడు డాక్టర్ యాదగిరి బాబు, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, బీజేపీ కోరుట్ల పట్టణ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మినారాయణలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నూతనంగా నియమింపబడ్డ వారిని డా. అనూప్ రావు అభినందించి శాలువాతో సత్కరించారు.

## బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటుకు తీర్మానం

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

నిర్మల్ జిల్లా కేంద్రంలోని న్యూ కలెక్టరేట్ రోడ్డులో భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు తీర్మానాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, డీసీసీ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది గాజుల రవికుమార్, నల్లూరి పోశెట్టి, కత్తి నరేందర్, ఆధ్వర్యంలో మాదిగ ఉద్యోగ ఫెడరేషన్ సభ్యులకు అందజేశారు. విగ్రహ ఏర్పాటు కోసం కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావుకు విన్నవించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
23.04.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## నిద్ర త్వరగా పట్టాలంటే.?

లైట్ డిన్నర్ తీసుకో వడం.. రాత్రి తేలికపాటి ఆహారం తీసుకోవడం మంచిది. భారీ భోజనం జీర్ణక్రియను పెంచి నిద్రను ఆలస్యం చేస్తుంది.





# ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు

**ముద్ర, యాదగిరిగుట్ట :**
ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆర్టీసీ కార్మికులు చేస్తున్న రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా యాదగిరిగుట్ట డిపో వద్ద కార్మికుల సమ్మెకు సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేసి, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి, శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్లో ఉన్న పే స్కేల్, పిఆర్సి బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గోద శ్రీరాములు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్ళేం కృష్ణ ఎండీ ఇమ్రాన్, కొల్లూరి రాజయ్య, పెరబోయిన మహేందర్, గోరేటి రాములు, కల్లేపల్లి మహేందర్, పెరబోయిన బంగారి, సామల భాస్కర్ ఆర్టీసీ జేఏసీ నాయకులు మంగ, ప్రభాకర్ రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

## సర్టిఫికెట్లు అందజేత

**ముద్ర, మోత్కూర్:**
మండల కేంద్రంలోని సేర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ )వారి సహకారంతో ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ప్రగతి టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ మోత్కూర్ లో ఎస్ హెచ్ జి మహిళకు కటింగ్ స్కిల్స్ ఫర్ స్కూల్ యూనిఫార్మ్స్ నాలుగు రోజులు శిక్షణ ఇచ్చారు. సుమారు 50 మంది మహిళలకు అడిష



నల్ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి కే జంగారెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపిఎం రవీందర్ , ప్రోగ్రాం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ రమణ, మోత్కూర్ ఏపీఎం పకీరయ్య, మోత్కూర్ ట్రైనింగ్ సెంటర్ అధికారి లక్ష్మీనారాయణ మహిళలు పాల్గొన్నారు.

## తహసిల్దార్ కు వినతి పత్రం అందచేత

**ముద్ర, మోత్కూర్:**
మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓటు వేయలేదనే నెపంతో తమ రేషన్ కార్డులు తొలగించేందుకు కొందరు కక్షసాధింపులకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జంగ శ్రీను ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఇటీవల మోత్కూర్ మున్సిపాలిటీ లోని ధర్మపురంలో పలు కుటుంబాలపై రాజకీయ కక్ష సాధిస్తున్నారని ఆరోపించారు. ఎవరికి సంబంధించిన రేషన్ కార్డులు తొలగించవద్దని తహసీల్దార్ కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి, చిప్పలపేల్లి మహేంద్ర



నాథ్, 10 వ వార్డ్ కౌన్సిలర్ నల్ల మధు, డివిఎంసి సభ్యులు దాసరి తిరుమలేష్, మాజీ సర్పంచ్ బయ్యని పిచ్చయ్య, ధర్మపురం గ్రామస్తులు వర్రే రాములు, ఎర్రోజు యశ్వంత్, అశోక్, తదూరి అనంతరెడ్డి, తదూరి రాజశేఖర్ రెడ్డి, జటంగి పరుశరాములు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని బిఎన్ తిమ్మాపురం సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి అన్నారు. బిఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన రావుల నగరాజు – రావుల రాజశేఖర్ ల బేబీ కిడ్స్ స్టూడియో ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ స్టూడియోను పెట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ.సమి, మోర రాం రెడ్డి, దొంకేన అశోక్ గౌడ్,



వళ్ళందస్ పరమేష్, నకిరేకంటి నరేష్, రాంబాబు, కేస దశరథ, కోరుపల్లి వెంకట్, రావుల మహిపాల్, రావుల శ్రీను, నకిరేకంటి పాండు పాల్గొన్నారు.

## మానసిక ప్రశాంతతకు యోగ ఎంతో అవసరం

**ముద్ర, మోత్కూర్:**
సంపూర్ణ ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో ఉత్తమమైన మార్గమని ఈషా ఫౌండేషన్ ప్రతినిధి, అడ్డగూడూరు ఎంపీడీవో పి.శంకరయ్య అన్నారు. బుధవారం మోత్కూరులో సద్గురు ఈషా



ఫౌండేషన్, రెడ్ క్రాస్ యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ, మోత్కూరు మండల శాఖ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ, అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. యోగా ధ్యానం ద్వారా సద్గురు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ఆధ్యాత్మిక మార్గదర్శనం చేస్తున్నారని చెప్పారు. ఇన్నర్ ఇంజనీరింగ్ వంటి కార్యక్రమాల ద్వారా వ్యక్తిగత వికాసాన్ని ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈషా వాలంటీర్లు డి.స్రవంతి, నరేష్, శివ, నవీన్, శృతి, గోపి సింగ్, స్వాతి, రెడ్ క్రాస్ మోత్కూరు మండల శాఖ అధ్యక్షుడు ఓ సత్యనాద్, ఉపాధ్యక్షుడు ముప్ప వెంకటరెడ్డి, కోశాధికారి బుస్స రవి, జిల్లా డైరెక్టర్లు ఎస్ ఎన్ చారి, పన్నాల శ్రీనివాసరెడ్డి, అనిల్ చేపూరి, ప్రసాద్, బిజెపి జిల్లా కోశాధికారి జి.సోమ నర్సయ్య పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెంచాలి

- జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్స్ పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరెట్ సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్, డీఈఓతో కలిసి బడిబాట సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడానికి గల కారణాలు తెలియ చేయ వలసిందిగా ప్రధానోపాధ్యాయులను కోరారు. అంగన్వాడీ కేంద్రాల్లో బడి ఈడు పిల్లల వివరాలు సేకరించి, ప్రైవేట్ బడికి వెళ్ళే విద్యార్థులు, ప్రభుత్వ బడికి వెళ్ళే విద్యార్థులు, డ్రాప్ అవుట్లు తదితర వివరాలు సేకరించి సరైన ప్రణాళిక ప్రకారం నమోదు పెంచాలని కోరారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థుల వివరాలు కూడా సేకరించి, ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం అందించే పథకాలను ఉపయోగించుకునే వారి పిల్లలను ప్రభుత్వ బడికి పంపాలని సర్పంచులను కోరామన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో చేర్పిస్తే కలిగే ప్రయోజనాలను ఉపాధ్యాయులు వివరించాలన్నారు. గత విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరిగిన పాఠశాలల వివరాలు తెలియజేసి, వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. 20 కన్నా తక్కువ విద్యార్థులు ఉన్న ప్రాథమిక, 50 కన్నా తక్కువ విద్యార్థులు ఉన్న ఉన్నత పాఠశాలల వారీగా సమీక్ష నిర్వహించి,నమోదు పెంచడానికి పలు సూచనలు చేశారు. ఆంగ్ల మాధ్యమం



లో పాఠశాలలు నడుపుతున్నాం కాబట్టి, ఉపాధ్యాయులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం పెంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖధికారి కె. సత్యనారాయణ, మండల విద్యాధికారులు,ప్రధానోపాధ్యాయులు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

# మల్లికార్జున్ ఖర్గే దిష్టి బొమ్మ దహనం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**
భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రిన్స్ చౌరస్తా వద్ద బుధవారం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దిష్టి బొమ్మ దహనం చేశారు. బిజెపి పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాయ దశరథ మాట్లాడుతూ మంగళవారం తమిళనాడులో జరిగిన ఎన్నికల సభలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ ని ఉగ్రవాది అని అనడం సిగ్గుచేటని మతిస్థిమితం కోల్పోతున్న ఖర్గే మీకు దేశం మీద ఎంత ప్రేమ ఉందో అందరికీ తెలుసని భారతదేశంలో ఉంటూ పాకిస్థాన్‌ను ప్రేమించే మీకు మా దేశ ప్రధాని గురించి మాట్లాడే స్థాయి లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి కౌన్సిలర్లు వంగేటి సూచిరిత, జెర్రిపోతుల స్వర్ణలత , తుమ్మల యాస్మిన్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు జైనపల్లి శ్యామ్ సుందర్ రెడ్డి, పన్నాల చంద్ర శేఖర్ రెడ్డి, మండల అధ్యక్షుడు సురేష్ రెడ్డి, నీలం రమేష్, మంగు నర్సింహా రావు, ఎండి.మహమూద్, మోర్చా అధ్యక్షులు డివిఎల్ ఎన్ గౌడ్, మాధురి చంద్ర, పట్నం కపిల్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఉడుత భాస్కర్, పట్టణ కొల్లాజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



**ముద్ర, తుంగతుర్తి:**
సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని పవిత్రమైనదని ఎంఈఓ బోయిని లింగయ్య, పీఆర్టీయు జిల్లా అధ్యక్షుడు జితేందర్ రెడ్డిలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో పోతరాజు చంద్రశేఖర్ అధ్యక్షతన ఎస్సీ కాలనీలో ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలు రౌతు శ్రీదేవి పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్య నేర్చుకుని మంచి పౌరులుగా పేరుపొందాలని అన్నారు. అనంతరం రౌతు శ్రీదేవి మాధవరావు దంపతులను ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మేధావులు, గ్రామస్తులు ఘనంగా శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ టి యు నాయకులు గుజ్జ భాస్కర్, గోపగాని ఉపేందర్, ఎర్ర హరికిషన్, మండల విశ్రాంత ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు పాలవరపు సంతోష్, ఎలుక కృష్ణారెడ్డి, గుండేటి లక్ష్మణరావు, తాళ్లపల్లి యాదగిరి పాల్గొన్నారు

# ఇందిరమ్మ నిర్మాణాలు వేగవంతంగా చేయాలి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మినీ మీటింగ్ హాల్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి ఇంజనీర్ల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సొంత ఇంటి కళ నెరవేర్చే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టిందని



తెలిపారు. ఇప్పటికే స్లాబ్ లెవెల్ పూర్తి అయిన ఇండ్లకు గృహప్రవేశాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి శ్రీరాములు, డిఈ, ఏఈ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబు రావు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**
చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబు రావు అన్నారు. బుధవారం భువనగిరి మార్కెట్ కమిటీ పరిధిలోని బొమ్మాయిపల్లి, పెంచికల్పహాడ్, బాలంపల్లి గ్రామాల్లో ఐకెపి వద్ద కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. దళారుల వ్యవస్థను తొలగించే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. బస్వాపురం కెనాల్ ద్వారా నీరు అందించి ఎండిపోయే స్థితిలో ఉన్న పొలాలను పంట చేతికి వచ్చే విధంగా చర్యలు తీసుకున్నాడని రైతులు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఆవేస్, భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ గంజి శ్రీవాణి గణేష్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మంగ ప్రవీణ్, పెంచికల్ పహాడ్ గ్రామ సర్పంచ్ పన్నాల మల్లికార్జున్ రెడ్డి, బాలంపల్లి సర్పంచ్ కాశపాక శ్రీరామ్, ఉప సర్పంచ్ సురుపంగ చందు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్పిఆర్డి తరగతులను జయప్రదం చేయండి

**ముద్ర, రామన్నపేట :** ఈనెల 24 న జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో జరిగే జిల్లా తరగతులను 17 మండలాల నుండి వికలాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎన్ పి ఆర్ డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ పిలుపునిచ్చారు. బుధవారం రామన్నపేట మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గిరికల లింగస్వామి, మండల ఉపాధ్యక్షులు నాగు నరసింహ, మండల సహాయక కార్యదర్శి పున్న శ్రీధర్, మండల నాయకులు కుందూరు వెంకటేశం, సదానందం, వంగాల నరసింహ, పగిల రమేష్ పాల్గొన్నారు.

# చేనేతను దెబ్బతీసే విధానాలు మానుకోవాలి

- చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకట నర్సు

**ముద్ర, మోత్కూర్:**
చేనేత పొట్టకొట్టే ఈ టెండర్ విధానాన్ని రద్దు చేసి, గురుకుల విద్యాసంస్థలతో సహా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విభాగాలకు చేనేత వస్త్రాలను తెలంగాణ స్టేట్ హైండ్లూమ్ వీవర్స్ సోసైటీ లిమిటెడ్ (టెస్కో) ద్వారానే కొనుగోలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించడం చేనేతకు జీవం పోయడమేనని ఈ తీర్పును హర్షిస్తున్నామని ఇప్పటికైన చేనేత కార్మికుల ఉపాధి దెబ్బతీసే ప్రభుత్వ విధానాలను మానుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకట నర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మోత్కూర్ లో విలేకరు



లతో మాట్లాడుతూ.. ఇప్పటికే చేనేత రంగం సంక్షోభంతో ఆత్మహత్యలు చేసకుంటున్నారని, చేనేత కార్మికులకు ఉపాధి కల్పించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం, ఈ టెండర్ ద్వారా చేనేత ఉపాధి దెబ్బ తీసే చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. ఈ టెండర్ విధానాన్ని రద్దు చేస్తూ టెస్కో ద్వారానే కొనుగోలు చేయాలనే హైకో ర్టు తీర్పు చేనేతకు జీవం పోయడమే కాక చేనేత కార్మికులకు ఉపాధి కల్పించే ఈ తీర్పును హర్షిస్తున్నామని, ప్రభుత్వం కూడ చేనేత కార్మికుల ఉపాధికి నష్టం కలిగించే విధానాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో చేనేత నాయకులు జెల్ల నాందేవ్, వడ్డేపల్లి లక్ష్మణ్ ఉన్నారు.

## సమ్మెను విరమింపజేయాలి


**ముద్ర, మోత్కూర్:**
ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చి సమ్మెను విరమింపజేయాలని కోరుతూ బిజెపి



పట్టణ మాజీ అధ్యక్షులు పోచం సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు వారిని మోసం చేయడం తగదని అన్నారు. ఆర్టీసీ కార్మికులు తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వారికి చాలీచాలని జీతాలతో వెట్టి చాకిరి చేయిస్తున్న ప్రభుత్వాలు వారి న్యాయమైన ప్రధానమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చి సామాన్య ప్రజల జీవితాలపై సమ్మె ప్రభావం లేకుండా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

### నిద్ర త్వరగా పట్టాలంటే.?

వార్మ్ షవర్ లేదా పాదస్నానం. పడుకునే ముందు గోరువెచ్చని నీటితో స్నానం చేయండి. ఇది శరీరాన్ని రిలాక్స్ చేసి నిద్రకు సిద్ధం చేస్తుంది.





## అర్హత ఉన్న జర్నలిస్టులకు కార్డులు అందాలి

- **పారదర్శకంగా అక్రిడిటేషన్ కార్డుల మంజూరు**
- **డిఎంసి చైర్‌పర్సన్, కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

అర్హత గల జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్, కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధ్యక్షతన అదనపు కలెక్టర్ నగేష్, డిపిఆర్ఓ రామచంద్ర రాజు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులపై డిపిఆర్ఓను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పనిచేస్తున్న మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా ప్రధాన వేదికగా ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల మీడియా ప్రతినిధుల గుర్తింపు ప్రక్రియలో ఎలాంటి వివక్ష లేకుండా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అక్రిడిటేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల ద్వారా సమగ్రంగా పరిశీలించి, అర్హత ప్రమాణాలు పూర్తి చేసిన అభ్యర్థులకు మాత్రమే కార్డులు జారీ చేయాలన్నారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం ఖచ్చితంగా పరిశీలించడంతో పాటు, అవసరమైన పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. అక్రిడిటేషన్ కార్డులు పొందిన మీడియా ప్రతినిధులు తమ వృత్తి నైతిక విలువలను పాటిస్తూ, సమాజానికి బాధ్యతాయుతంగా సేవలందించాలన్నారు. అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ భూపాల్, కమిటీ సభ్యులు శంకర్ దయాల్ చారి, బుక్క అశోక్, గోపాల్ గౌడ్, దేవరాజ్, శ్రీధర్, ఫరూక్ హుస్సేన్, సురేందర్ రెడ్డి, నాగరాజు, శ్రీనివాస చారి, ఏపిఆర్ఓ బాబురావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో మొదటిసారిగా ఎస్టీపీలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు

- **జల్ హీ అమృత్ పథకం ద్వారా 2.75 కోట్లు మంజూరు**
- **మున్సిపల్ చైర్పర్సన్ మంజుల, కమిషనర్ ఆశ్రిత్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

దేశంలో మొదటి ఎస్టీపీ లో సోలార్ ప్లాంట్ ను సిద్దిపేట మున్సిపాలిటీలో ఏర్పాటు చేసుకొని ప్రారంభించుకున్నామని, ఈ ఘనత సిద్దిపేటకే దక్కుతుందనీ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని మురుగునీటి శుద్ధి కర్మాగారంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ తో కలిసి సోలార్ ప్లాంట్ ను మున్సిపల్ చైర్పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు బుధవారం ప్రారంభించారు. సోలార్ ప్లాంట్ మొతాన్ని అధికారులతో కలియతిరుగుతూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే హరీష్ రావు సహకారంతో సిద్దిపేటలో అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకున్నామని, హరీష్ రావు సిద్దిపేట పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని 2022 సంవత్సరంలో మురుగు నీటి శుద్ధికరణ కేంద్రం (ఎస్టీపీ) నీ ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా విద్యుత్ బిల్లు భారం తగ్గిందన్నారు. అంతకుముందు మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ మాట్లాడుతూ మురుగు నీటి శుద్ధికరణ నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో జెల్ కి అమృత్ పథకంలో భాగంగా చేపట్టిన సర్వేలలో సిద్ధిపేట నర్సాపూర్ ఎస్టిపికి ఫోర్ స్టార్ రేటింగ్, చింతల్ చెరువు ఎస్టిపీకి త్రి స్టార్ రేటింగ్ రావడం జరిగిందన్నారు. నర్సాపూర్ ఎస్టీపీ కి 2 కోట్లు, చింతలచెరువు ఎస్టీపీ కి 75 లక్షలు మంజూరు కాగా అట్టి డబ్బులతో రెండు ఎస్టీపీ లకు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 45 ఎస్టీపీ లు, 9 మున్సిపాలిటీ & కార్పొరేషన్ లు ఎంపిక కాగా హైదరాబాద్, వరంగల్ , సిద్దిపేట మున్సిపాలిటీ లకు మాత్రమే ఫోర్ స్టార్ రేటింగ్ రావడం శుభ పరినామం అన్నారు. ఈ సోలార్ ప్లాంట్ ద్వారా 286 కిలో వాట్స్ (నర్సాపూర్ ఎస్టీపీ 245 , చింతల చెరువు ఎస్టీపీ 41) కిలో వాట్స్ గల విద్యుత్ సరఫరా చేయవచ్చన్నారు. ఈ రెండు ఎస్టిపి ప్లాంట్ల నిర్వహణకు 16 లక్షల విద్యుత్ బిల్లులు వస్తున్నాయని, సోలార్ ప్లాంట్ల ద్వారా రూ.8 లక్షల విద్యుత్ చార్జీలు తగ్గించుకోవడం జరుగుతుందని చెప్పారు. మంజూరైనటువంటి డబ్బులతో రెండు ఎస్టీపీ లలో స్కాడ (సూపర్వైజరి కంట్రోల్ అండ్ డేటా అక్విజిషన్) లను కూడా ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. స్కాడ ద్వారా యంత్రాలను, ప్రక్రియలను, కంప్యూటర్ ద్వారా దూరం నుండి పర్యవేక్షించి మరియు నియంత్రించే వ్యవస్థ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు, కౌన్సిలర్ ఎడ్ల అరవింద్ రెడ్డి, డీఈ ప్రేరణ, ఏఈఈ పృధ్వి తదితరులు పాల్గొన్నారు.



## ఆగిన బస్సు చక్రం




- **బస్సులు నడిపేందుకు యత్నం- అడ్డుకున్న కార్మికులు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు సమ్మె చేపట్టారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి కార్మికులు విధులు బహిష్కరించడంతో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీ జేఏసీ నేతలతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు విఫలం కావడంతో సమ్మె అనివార్యమైంది. జిల్లాలోని మెదక్, నర్సాపూర్ ఆర్టీసీ డిపోల వద్ద తెల్లవారుజామున జేఏసీ నేతలతో కలిసి కార్మికులు పెద్ద ఎత్తున బైఠాయించారు. పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు మోహరించారు. మెదక్ ఆర్టీసీ డిపోలో పోలీసులకు, ఆర్టీసీ కార్మికుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. బస్సులను డిపోల నుంచి బయటకు వెళ్లనివ్వకుండా కార్మికులు అడ్డుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన విరమించబోమని నినాదాలు చేశారు. బస్సులను కదిలించే యత్నం చేయగా కార్మికులు అడ్డుకున్నారు. ఒక దశలో బస్సుల ముందు అడ్డంగా పడుకున్నారు. టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్ ఆధ్వర్యంలో పోలీసులు వారిని పక్కకు తరలించారు. కార్మికుల సమ్మెతో ప్రజా రవాణాకు అంతరాయం ఏర్పడింది. సమ్మె ప్రభావంతో బస్సులు నిలిచిపోవడంతో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేసే ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. అద్దె బస్సులను నడిపించడంతో పాటు తాత్కాలికంగా కండక్టర్ల నియామకానికి పదో తరగతి ఉత్తీర్ణుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయా డిపో మేనేజర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మిక నేతలు మాట్లాడుతూ, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 30 శాతం ఫిట్‌మెంట్, వేతన బకాయిలను చెల్లించాలని కోరారు. పీఎఫ్, సీసీఎస్‌కు సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. యూనియన్ల పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యానికి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు వినతి పత్రాలు అందించినా స్పందన లేకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం తక్షణం స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో నిరవధిక సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు.



### ఆర్టీసీ సమ్మె.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం

- **కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. బుధవారం అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్యతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పని చేస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమర్జెన్సీ అవసరాల కోసం కంట్రోల్ నంబర్ 939194225‌4ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమ్మెతో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లాలోని మెదక్, నర్సాపూర్ బస్ డిపోల నుంచి బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. మెదక్ నుంచి 100, నర్సాపూర్ నుంచి 37 బస్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రెండు బస్ డిపోల పరిధిలో కొత్తగా కండక్టర్లను నియమిస్తున్నామని, అలాగే గతంలో ఆర్టీసీ డ్రైవర్ పోస్టుల కోసం దరఖాస్తు చేసిన వారిని పరిశీలించి వారి సేవలను వినియోగించుకుంటామని తెలిపారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల అధికారుల సమన్వయంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రైవేట్ స్కూల్స్, కంపెనీల ప్రతినిధులను సహకరించాలని కోరినట్లు తెలిపారు. వారి సహకారంతో ప్రజల అవసరాల మేరకు బస్ సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు.

## ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- **మంత్రి పొన్నం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండన**
- **ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపిన ఎమ్మెల్యే హరీశ్ రావు**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



సిద్దిపేట ఆర్టీసీ డిపో వద్ద తమ సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అయినప్పటికీ కార్మికులు రెండున్నరేళ్లుగా ఓపిక పట్టి చివరకు సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వంలో ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ కార్మికులను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలనే కార్మికులు అడుగుతున్నారని అన్నారు. ఆర్టీసీని కాపాడే పరిస్థితి లేదని, దాన్ని రక్షించకపోతే ప్రైవేట్ అవుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. హైదరాబాద్‌లో ఆర్టీసీని ప్రైవేటీకరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చిన తర్వాత డ్రైవర్, కండక్టర్లపై ఒత్తిడి పెరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల ఉసురు పోసుకుంటుందని విమర్శించారు. మేధావులు స్పందించడం లేదని, కోదండరామి రెడ్డి లాంటి వ్యక్తులు ఆర్టీసీ కార్మికుల సమ్మెపై మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్య విభేదాలు ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని, ఇక్కడ ఎందుకు గుర్తించరని ప్రశ్నించారు. దీనిపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ఆర్టీసీకి రూ.200 కోట్ల చెక్కు ఇచ్చినా దానికి ఫలితం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన చెక్కు ఇప్పటివరకు చెల్లలేదని విమర్శించారు. గతంలో ఇచ్చిన బస్సులనే ఇప్పుడు జెండా ఊపి ప్రారంభిస్తున్నారని ఎద్దేవా చేశారు. సేవ పూర్తయిన బస్సులను తొలగించి కొత్త బస్సులను తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని చెబితే కార్మికులు సమ్మె ఎందుకు చేస్తారని, వెంటనే గుర్తిస్తే సమ్మె విరమిస్తారని అన్నారు. ఆర్టీసీ సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ మద్దతుగా ఉంటుందని, పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఆర్టీసీ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ఆరోపించారు. కొత్త డ్రైవర్లను నియమించకపోవడంతో పాత డ్రైవర్లపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందన్నారు. సమ్మె కొనసాగుతున్న నేపథ్యంలో కాంట్రాక్ట్ డ్రైవర్లను తీసుకువచ్చి ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నారని మండిపడ్డారు.

## సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలి

- **కాళేశ్వరం అవినీతి నిగ్గు తేలాలంటే కాంగ్రెస్ ఇది చేయాలి**
- **మెదక్ ఎంపీ రఘునందన్ రావు**

**ముద్ర, న్యూఢిల్లీ:**

కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్ నుంచి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన దశ వరకు సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర హోం మంత్రికి లేఖ రాయాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి కాళేశ్వరాన్ని 'కూళేశ్వరం'గా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ చేసిన అవినీతి సొమ్మును కక్కిస్తామని రాహుల్ గాంధీతో పాటు హామీ ఇచ్చి రెండున్నరేళ్లుగా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో రెండు పార్టీల మధ్య ఒప్పందం ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కేసీఆర్ మానస పుత్రిక అయిన కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసిన కంపెనీకి, రేవంత్ రెడ్డి మానస పుత్రికగా పేర్కొన్న మూసీ ప్రాజెక్టు కాంట్రాక్టును కూడా ఇస్తున్నారని ఆరోపించారు. అందుకోసమే ఆ కంపెనీకి కాంట్రాక్టు లభించేలా నిబంధనలు మార్చినట్లు ఉందన్నారు. త్వరలోనే అదే కంపెనీకి మూసీ ప్రాజెక్టులో మొదటి దశ కింద రూ.9,500 కోట్ల టెండర్ ఇవ్వనున్నట్లు సమాచారం ఉందన్నారు. మావోయిస్టు పార్టీలా బీఆర్ఎస్ పార్టీ కూడా రాష్ట్రంలో కనుమరుగవడం ఖాయమని పేర్కొన్నారు.

## పంట కొనుగోలు చేయకపోతే.. రహదారి దిగ్బంధం చేస్తాం

- **బీఆర్ఎస్ నాయకుల అల్టిమేటం**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే పొద్దుతిరుగుడు, మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే రాజీవ్ రహదారిని దిగ్బంధం చేస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, కాముని శ్రీనివాస్ హెచ్చరించారు. వారు మాట్లాడుతూ, మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను నమ్మబలికిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలపై దృష్టి సారించడం లేదన్నారు. వరంగల్ సభలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి కలిసి 'రైతు డిక్లరేషన్' పేరుతో సభలు నిర్వహించి హామీలు ఇచ్చి, ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని విస్మరించారని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా, ధాన్యాన్ని కొనుగోలు చేయక రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్, హరీశ్ రావు ఆధ్వర్యంలో రైతు శ్రేయస్సు లక్ష్యంగా పనిచేశామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి సాగునీరు అందించి, లక్షల ఎకరాల్లో పండిన పంట ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పూర్తిగా కొనుగోలు చేసిన ఘనత తమదేనని అన్నారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా రేవంత్ రెడ్డి విమర్శలకే పరిమితమైపోయారని, రైతుల కోసం పండించిన ధాన్యం కొనుగోలు చేయడంపై దృష్టి పెట్టడం లేదన్నారు. ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తూ ప్రజా మీటింగ్‌లు నిర్వహించి ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తూ కాలం గడుపుతున్నారని ఆరోపించారు. '90 రోజుల ప్రజా పాలన' పేరుతో గ్రామాలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని, ఆ సమావేశాలకు మంత్రులు మాత్రమే కాకుండా ఎమ్మెల్యేలు కూడా హాజరు కాలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ధైర్యం ఉంటే గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి రైతులకు, ప్రజలకు ప్రభుత్వం ఏమి చేసిందో వివరించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో మార్కెట్‌కు వచ్చిన పొద్దుతిరుగుడు, మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ మండల సీనియర్ నాయకులు, మండల పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
23.04.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**నిద్ర త్వరగా పట్టాలంటే..?**

మెడిటేషన్ లేదా దీర్ఘశ్వాస వ్యాయామం

5–10 నిమిషాలు ధ్యానం లేదా గాఢంగా శ్వాస తీసుకోవడం చేయండి.



ఇది స్ట్రెస్‌ను తగ్గించి నిద్రను త్వరగా తెస్తుంది.

## రూ. 98వేల కోట్లతో రహదారుల నిర్మాణం

- **2028లోగా తెలంగాణలో దేశంలోనే అత్యుత్తమ రోడ్లు**
- **నవంబర్ లో హైటెక్స్ లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్**
- **రహదారుల నిర్మాణం, అభివృద్ధిపై సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే కనీ విని ఎరగని విధంగా రాష్ట్రంలో రూ. 98 వేల కోట్ల విలువైన రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులు చేపదుతున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని, వేగంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 2028 చివరి నాటికి రోడ్ల నిర్మాణంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టినట్టు తెలిపారు. దేశంతో పాటు ప్రపంచం నలుమూలల నుంచి రోడ్డు కాంట్రాక్టర్లు, బిల్డర్లు హాజరయ్యే ప్రతిష్ఠాత్మక ఇండియన్ రోడ్డు కాంగ్రెస్ సమావేశం 2026 నవంబర్ లో హైదరాబాదులోని హైటెక్స్ లో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు విజయవంతమయ్యాయని మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఎంపీగా, కేంద్ర మంత్రి గడ్కరీ తో తనకున్న పరిచయంతో హైదరాబాద్ లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశం నిర్వహించేందుకు ఒప్పించానని వివరించారు. ఈ సమావేశం నిర్మాణాలకు బీజేపీ పాలనలోని రాష్ట్రాలు పోటీపడినప్పటికీ కేంద్ర మంత్రి గడ్కరీ తన విజ్ఞప్తి మేరకు రాష్ట్రంలో నిర్వహించేందుకు అనుమతించినట్లు తెలిపారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గా రాష్ట్రానికి చెందిన మోహన్ నాయక్ ఎన్నికైన విషయాన్ని సైతం మంత్రి గుర్తు చేశారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశాన్ని నిర్వహణకు అవసరమైన నిధులను బుధవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశం అనంతరం రాష్ట్రానికి రూ.20 వేల కోట్లకు పైగా పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రూ.148 కోట్లతో నిర్మించనున్న అప్రోచ్ రహదారులతో 300 గ్రామాల్లో నెలకొన్న సమస్యకు పరిష్కారం లభించనుందని తెలిపారు. గత ప్రభుత్వం సమావేశాలు పెట్టి వదిలివేయడం తప్ప అప్రోచ్ రోడ్ల పూర్తికి నిధులు మంజూరు చేయలేదన్నారు. రాష్ట్రంలో రూ.13 వేల కోట్లతో 6 వేల కిలోమీటర్ల రహదారులను హ్యామ్ మోడల్ లో చేపడుతున్నట్టు వివరించారు. ఈ పనులకు సంబంధించిన ప్రైస్ బిడ్ పనులు పూర్తయ్యాయని, మే మొదటి వారంలో రాష్ట్రంలో హ్యామ్ మోడల్ లో రోడ్ల నిర్మాణం చేపట్టుతున్నట్టు వివరించారు. రూ. 20 వేల కోట్లతో హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు. మొత్తం ఎనిమిది లైన్లతో ఈ రహదారి విస్తరణ చేపట్టినట్టు తెలిపారు. ఆరు ప్రధాన లైన్లు, రెండు సర్వీస్ లైన్ల నిర్మాణం జరుగుతుందన్నారు. రూ.500 కోట్లతో బ్లాక్ స్పాట్స్, చౌటుప్పల్, చిట్యాల వంటి గ్రామాల మీదుగా ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణం జరుగుతుందని వివరించారు.

**రూ. 20 వేల కోట్లతో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు**

ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి బందరు పోర్టు వరకు రూ. 20 వేల కోట్లతో గ్రీన్ ఫీల్డ్ రోడ్ నిర్మాణానికి అలైన్మెంట్ ఖరారు చేసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు వివరించారు. ఈ రోడ్డు అలైన్మెంట్ కు అనుగుణంగా బుల్లెట్ ట్రైన్ నడిపేందుకు అవసరమైన అలైన్మెంట్ సైతం ఖరారు చేసి కేంద్రానికి పంపినట్టు వివరించారు. అలాగే మన్ననూరు శ్రీశైలం 52 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ రహదారి నిర్మాణానికి రూ. 8వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ. 36 వేల కోట్లు మంజూరు అయ్యాయని ఇది రాష్ట్రానికి గేమ్ చేంజర్ ప్రాజెక్టు అని వెల్లడించారు. ఈనెల 8న రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తరభాగం భూసేకరణకు రాష్ట్ర వాటాగా రూ. 628 కోట్లు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు జమ చేసినట్లు తెలిపారు. ఎల్బీనగర్, హయత్ నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ను రూ. 941 కోట్లతో చేపడుతున్నామని వివరించారు. ఇందులో కేంద్రం వాటా రూ. 741 కోట్లు కాగా రాష్ట్రం రెండు వందల కోట్లు ఖర్చు చేయనుందని తెలిపారు. రహదారులు లేని గ్రామాల్లో కొత్త రోడ్లు, సింగిల్ రోడ్ల స్థానంలో డబుల్ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. రహదారుల నిర్మాణంతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు తరలివస్తాయి, తద్వారా స్థానిక యువతకు పెద్ద మొత్తంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. రోడ్డు ప్రమాదాలతో రాష్ట్రంలో 2025లో 6,500 మంది ప్రాణాలు కోల్పోయారని, ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకొని పెద్ద ఎత్తున రహదారుల నిర్మాణం, అరైవ్అలైవ్ వంటి కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినట్టు తెలిపారు.

## రివర్స్ టూరిజం

- **పర్యాటక రంగంలో సరికొత్త ప్రయోగం**
- **హైదరాబాద్ పయనమైన 250 మంది అడవి బిడ్డలు**
- **తారామతి బారదరిలో స్వాగతం పలికిన పర్యాటక శాఖ అధికారులు**

**ముద్ర, ఉట్నూరు:**

రాష్ట్ర పర్యాటక రంగ చరిత్రలో సరికొత్త ఒరవడికి నాంది పడింది. కేవలం నగరవాసులు ప్రకృతిని చూడటానికి పల్లెలకు వెళ్లడమే కాకుండా, అడవి బిడ్డలు సైతం ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వైభవాన్ని కళ్లారా చూడాలన్న సంకల్పంతో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 'రివర్స్ టూరిజం'కు శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గోండు గూడెంలో బుధవారం నిర్వహించిన 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్'ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదివాసీలకు కొత్త అనుభవాలు ఇవ్వడం, నగర జీవన విధానం పరిచయం చేయడం, ఆత్మవిశ్వాసం, రెండు సంస్కృతుల మధ్య అవగాహన పెంచడం, సాంస్కృతిక మార్పిడి, అంతిమంగా ఆదివాసీల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు వివరించారు.

**ఆదివాసీలతో మమేకమైన మంత్రి**

కార్యక్రమాన్ని ప్రారంభించడమే కాకుండా, మంత్రి జూపల్లి స్వయంగా ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. దారి పొడవునా వారితో ముచ్చటిస్తూ పర్యటన లక్ష్యాన్ని వివరించారు. బయటి ప్రపంచంతో అనుసంధానం కావడంతో పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. నగరాల్లోని అభివృద్ధిని చూసి చదువుల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలని పిలుపునిచ్చారు. అప్పుడే ఆదివాసీల జీవన ప్రమాణాల్లో మార్పులు వస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

**నగర నాగరికతకు,- సంస్కృతికి వారధి**

ఆదివాసీల విశిష్ట సంస్కృతికి, నగర నాగరికతకు మధ్య ఈ కార్యక్రమం ఒక వారధిలా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఐదు ప్రత్యేక బస్సుల్లో బయలుదేరిన 250 మంది ఆదివాసీలు మధ్యాహ్నం హైదరాబాద్‌లోని తారామతి బారాదరికి చేరుకున్నారు. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో విమానాశ్రయం, చార్మినార్, గోల్కొండ కోట, లుంబినీ పార్క్, శిల్పారామం వంటి ప్రాంతాలను వీరు సందర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ కాప్దే పాల్గొన్నారు. వీరితో పాటు డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆత్రం సుగుణ, కాంగ్రెస్ నాయకులు ఆత్రం సక్కు, సోయం బాపురావు, ఆడే గజేందర్ పాల్గొన్నారు.





# ఆక్రమణలో ఫుట్‌పాత్ లు

- **పాదచారులకు దారేది..?**
- **గద్వాల రహదారి ఇరువైపులా వెలిసిన దుకాణాలు**
- **తరుచూ రోడ్డు ప్రమాదాలు**
- **పట్టించుకోని అధికారులు**

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**

జిల్లా కేంద్రంలో ఫుట్ పాత్ ల అక్రమణతో విశాలమైన గద్వాల రోడ్లు ఇరుకుగా మారి తరుచు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గద్వాల పట్టణంలో రహదారికి ఇరువైపుల పాదచారుల కోసం వదిలిన ఖాళీ స్థలాలను షాపు యజమానులు, చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు అక్రమించుకున్నారు. వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో గతంలోనే ఫుట్‌పాత్‌లను నిర్మించేందుకు ఈ స్థలాలను వదిలారు. కానీ ఎక్కడ ప్రత్యేకమైన ఫుట్ పాత్ లు నిర్మించలేదు. ఇదే అదునుగా చూసుకుని వాటిని కూడా కొంతమంది ఆక్రమించుకున్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు లేకుండా, పాదచారులు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకునే విషయంలో అధికారయంత్రాంగం వైఫల్యం చెందిందన్న విమర్శలున్నాయి. కొంతమంది ప్రజాప్రతినిధులు, నాయకులు అండదండలతోనే ఫుట్‌పాత్‌లపై దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డుకిరువైపులా ఉన్న ఖాళీ స్థలాలను ఆక్రమించి, చివరికి పర్మినెంట్ స్ట్రక్చర్‌తో దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ నిర్మాణాలన్నీ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగేవిధంగా ఉన్నా, నేటి వరకు ఆ దుకాణాలను తొలగించే ప్రయత్నాలు చేయకపోవడంతో వీరికి అడ్డు అదుపులేకుండా పోయింది.

గద్వాల మున్సిపాలిటీ పరిధిలో ఎప్పుడు రద్దీగా ఉండే రాజీవ్ మార్గ్, రాజవీధి, పాత కూరగాయల మార్కెట్, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, కృష్ణవేణి చౌరస్తా, భీంనగర్, అంబేద్కర్ చౌరస్తాలలో వ్యాపారులు తమ దుకాణాల పేరు మీద పెద్ద పెద్ద ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేయడంతో వాహనదారులు, పాదచారుల రాకపోకలకు ఇబ్బంది నెలకొంది. కొన్ని సందర్భాలలో పాదచారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. కొత్త బస్టాండ్, భీంనగర్ లాంటి రద్దీ ప్రాంతాలలో ఫుట్ పాత్ లను చోటామోటా లీడర్లు ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహిస్తు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా ఫుట్‌పాత్‌లపై వెలిసిన షాపులను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**రోడ్లపైనే వాహనాలు పార్కింగ్**

గద్వాలలో రాజవీధి, గాంధీచౌక్, పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, కృష్ణవేణి చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, రాజీవ్ మార్గ్ తదితర మార్గాలలో రహదారిపై అక్రమంగా వాహనాలు పార్కింగ్ చేయడం, ఫుట్ పాత్ లపై వ్యాపారస్తుల బోర్డులు పెట్టడం వల్ల ట్రాఫిక్ సమస్యగా తలెత్తుతోంది.

**ఇరుకుగా మారిన భీంనగర్ రోడ్డు**

కృష్ణవేణి చౌరస్తా నుంచి నదీ అగ్రహారం వైపునకు వెళ్లే భీంనగర్ రోడ్డు మార్గం చాలా విశాలంగా ఉండేది. ఇది వ్యాపారులు అక్రమించుకోవడంతో ఇరుకుగా మారింది. డ్రైనేజీ కాలువను సైతం అక్రమించుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో వాహనాలు రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు.

**ఫుట్ పాత్ @రూ.10వేలు**

గద్వాల పట్టణం కృష్ణవేణి చౌరస్తా నుంచి నదీ అగ్రహారం రోడ్డు వరకు హోటళ్లు, పానీపూరి, సమోసా, టీ స్టాళ్లు, తదితర తిను బండాదాలకు అడ్డగా భీంనగర్ మారింది. భీంనగర్ అడ్డలో ఏ చిరువ్యాపారం పెట్టినా వ్యాపారం లాభాదాయకంగా ఉండటంతో ఇక్కడ వ్యాపారం చేయడానికి మొగ్గు చూపుతున్నారు. ఇక్కడా ఫుట్ పాత్ స్థలాలను వ్యాపారస్తులు దర్జాగా కబ్జాచేస్తున్నారు. చిన్న చిన్న రేకుల షెడ్డు ఏర్పాటు చేసి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అద్దెకు ఇస్తున్నారు. అలాగే వాణిజ్య షాపుల ముందున్న ఫుట్ పాత్ ల రోడ్లను సైతం అక్రమించుకుని చిరువ్యాపారస్తులకు రూ.10,వేలకు అద్దెకు ఇస్తున్నారు. భీంనగర్ లో ఓ మటన్ సెంటర్ ముందున్న ఫుట్ పాత్ రోడ్డుపై పానీపూరి షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు. దీనికి నెలకు రూ.10 వేల అద్దె షాపు ఓనర్లకు చెల్లిస్తున్నారు. మరీ షాపు ముందు సమోసా పాయింట్ పెట్టుకునేందుకు రూ.10 వేలు అద్దె చెల్లిస్తున్నారు.

**నాడు వద్దు.. నేడు ముద్దు**

గతంలో భీంనగర్ లో సంతాన వేణుగోపాల స్వామి జాతర సందర్భంగా ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక దుకాణంపై ప్రమాదవశాత్తు మట్టి ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఆ ప్రాంతంలో జాతర దుకాణాలు ఏర్పాటుకు నిషేధించాలంటూ కొందరు కోర్టు నుంచి స్టే తీసుకువచ్చారు. ఇటీవల జాతర సందర్భంగా దుకాణాల ఏర్పాటును అడ్డుకున్నారు. రోడ్లపైనే వ్యాపారాల వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించవా? అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జాతరను ఇక్కడి నుంచి తరలించాలన్నా మేధావులు, ఫుట్ పాత్ రోడ్లను అక్రమించుకుని దర్జాగా వ్యాపారాలు చేస్తుంటే మౌనం ఎందుకు వహిస్తున్నారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# ఖమ్మంలో ఎన్ఐఏ తనిఖీలు

- **పోటు రంగారావును విచారించిన అధికారులు**

**ముద్ర, ఖమ్మం :**

గతంలో మావోయిస్టులకు అనుకూల ప్రకటన చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖమ్మం జిల్లా సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్/ ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ ఐ ఏ) అధికారులు బుధవారం విచారించారు. ఇప్పటికే ఆయనపై ఎన్ఐఏ అధికారులు కేసు నమోదు చేశారు. ఈనెల 2న విచారణకు హాజరు కావాలని పోటు రంగారావుకు నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులపై స్పందించిన పోటు రంగారావు, 22న తాను ఖమ్మంలో అందుబాటులో ఉంటానని అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ మేరకు నేడు అధికారులు నేరుగా ఖమ్మం వచ్చి విచారణ చేపట్టారు. కాగా ప్రజా సమస్యలపై గళమెత్తే నాయకులను కేంద్ర ప్రభుత్వం ఎన్ఐఏ పేరుతో వేధిస్తోందని సీపీఐ (ఎంఎల్) నాయకులు ఆరోపించారు. తప్పుడు కేసులతో భయపెట్టాలని చూడటం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. పోటు రంగారావు విచారణ నేపథ్యంలో ఖమ్మం రాజకీయ వర్గాల్లో వామపక్ష శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.








# రైతులకు, మహిళలకు ప్రభుత్వం పెద్దపీట

- **నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి**

**ముద్ర, వనపర్తి:**

ప్రజా ప్రభుత్వం రైతులకు, మహిళలకు సమున్నత స్థానం కల్పిస్తోందని, సన్నరకం ధాన్యానికి బోనస్ కల్పించి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి అన్నారు. బుధవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి పెద్దమందడి మండలంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఐకేపీ ఆధ్వర్యంలో పెద్దమందడి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం, వెల్టూరు గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం వడ్ల సంచిని తూకంపై పెట్టి కాంటా చేసి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రైతులకు, మహిళలకు సమున్నత స్థానం కల్పిస్తోందని, సన్నరకం ధాన్యానికి బోనస్ కల్పించి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. ధాన్యం అమ్మకానికి వచ్చిన రైతులకు తేమ శాతం వచ్చిన వెంటనే కొనుగోలు చేసి టాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. రైతులకు వారం రోజుల్లో నగదు పడే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సన్న రకం ధాన్యానికి బోనస్ ఇచ్చి రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తోందని తెలిపారు. రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ

వెల్టూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన పలువురు లబ్ధిదారులకు ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా మంజూరు పత్రాలు అందజేశారు. ఇల్లు లేని నిరుపేదలను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తూ లబ్ధిదారులకు ఇల్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షలు ఆర్థికసాయం అందిస్తుందని తెలిపారు.

యుబిఐ సేవలు ప్రశంసనీయం


వనపర్తి, నాగర్ కర్నూలు జిల్లాల్లో లీడ్ బ్యాంకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలు ప్రశంసనీయం అని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి ప్రశంసించారు. బుధవారం గోపాల్పేట మండల పరిధిలోని గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన బ్రాంచ్ ను వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి తో కలిసి ప్రారంభించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీజీఎం రవీంద్రబాబు, మాజీ ఆర్ఎం సత్యనారాయణ, నూతన ఆర్ఎం వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లురవి మాట్లాడుతూ బ్యాంకులు రైతులకు, ఎంఎస్ఎమ్ఈలకు ప్రాధాన్యతగా రుణాలు ఇవ్వాలని తద్వారా ఎంతమందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. బ్యాంకులో నుంచి రుణాలు పొందిన వారు కూడా సకాలంలో వాటిని తిరిగి చెల్లించి బ్యాంకుల అభివృద్ధికి కూడా సహకరించాలని సూచించారు. సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద చర్యలు తీసుకుంటుందన్నారు. నాగర్ కర్నూల్ రైల్వే లైన్ కోసం ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి నూతనంగా ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఉపయోగపడుతుందని తెలిపారు. గోపాల్పేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నూతన సైన్స్ ల్యాబ్ ను, మండల కేంద్రంలో హైమాస్ట్ లైట్లను, బుద్ధారం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, లీడ్ బ్యాంకు మేనేజర్ శివకుమార్, స్థానికులు అచ్యుత రామారావు, బుద్ధారం సర్పంచ్ శేఖర్ పాల్గొన్నారు.

**నిద్ర త్వరగా పట్టాలంటే?**

బెడ్‌ను నిద్రకే ఉపయోగించడం

బెడ్‌పై పని లేదా మొబైల్ వాడకాన్ని తగ్గించండి.

అలా చేస్తే మెదడు బెడ్‌ను నిద్రతోనే అనుసంధానిస్తుంది.





# కాళేశ్వరంపై చర్యలొద్దు

- **ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు**
- **ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై విచారణ**

ముద్ర, తెలంగాణ బ్యూరో:

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై రాష్ట్ర ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కోర్టు కీలక తీర్పును వెలువరించింది. జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు చట్టబద్ధతను సమర్థిస్తూ, ఆ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే, ఈ కమిషన్ విచారణలో నిబంధనలు పూర్తిగా పాటించలేదని వ్యాఖ్యానించింది. సెక్షన్ 8 కింద నోటీసు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. హైకోర్టు తీర్పుతో కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్ రావు, ఐఏఎస్ అధికారులు స్మిత సబర్వాల్, ఎస్‌కే జోషికి ఊరట లభించింది. తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని 2024 మార్చిలో పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అయితే ఈ కమిషన్‌ను ఏర్పాటు చేయడాన్ని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు ఐఏఎస్ అధికారులు స్మిత సబర్వాల్, ఎస్‌కే జోషిలు హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఈ పిటిషన్‌లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ కొనసాగించింది. విచారణలో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ జరిపేందుకు ఏర్పాటు చేసిన ఘోష్ కమిటీ తమ వాదనలను పరిగణలోకి తీసుకోలేదని పిటిషనర్లు కోర్టుకు తెలిపారు. ఈ కమిషన్ విచారణ ప్రక్రియలో పలు ఉల్లంఘనలు జరిగాయని పేర్కొన్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం తమ వాదనలు వినిపిస్తూ, ఘోష్ కమిషన్‌ను ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేశామని, రికార్డుల ఆధారంగానే నివేదిక సమర్పించిందని వివరించింది. పిటిషనర్లు సహా పలువురికి నోటీసులు ఇచ్చి విచారణ నిర్వహించినట్లు కోర్టుకు తెలిపింది. ఈ పిటిషన్‌లపై సుదీర్ఘంగా వాదనలు కొనసాగాయి. ధర్మాసనం మార్చి 12న తీర్పును రిజర్వ్ చేసి, ఈ నెల 8న వెల్లడిస్తామని తెలిపింది. అనంతరం విచారణను వాయిదా వేసి, ఎట్టకేలకు బుధవారం తీర్పును ప్రకటించింది.

# టెస్కో ద్వారానే చేనేత వస్త్రాలు సేకరించాలి

- **రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు**


ముద్ర, తెలంగాణ బ్యూరో:

తెలంగాణ సర్కారుకు హైకోర్టులో చుక్కెదురైంది. ప్రభుత్వ సంస్థలకు అవసరమైన దుస్తులు, బెడ్ షీట్లను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా సేకరించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. అన్ని ప్రభుత్వ అవసరాలకు ఖచ్చితంగా టెస్కో ద్వారానే చేనేత వస్త్రాలను సేకరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, ఇతర ప్రభుత్వ సంస్థలకు అవసరమైన దుస్తులు, బెడ్ షీట్లను ప్రైవేట్ సంస్థల ద్వారా సేకరించేందుకు ఈ నెల 2న ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో చేనేత కార్మికుల పొట్టకొట్టినట్లవుతుందని వరంగల్ జిల్లాకు చెందిన వీరాంజనేయ హ్యాండ్లూమ్ వీవర్స్ సహా పలు సొసైటీలు హైకోర్టును ఆశ్రయించాయి. ఆ పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. చేనేత పరిశ్రమపై రాష్ట్రంలో దాదాపు 40 వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని కోర్టు పేర్కొంది. చేనేత పరిశ్రమను ఆదుకునేందుకే గతంలో అన్ని ప్రభుత్వ కాంట్రాక్టులు వారికే దక్కేలా జీవోలు జారీ చేశారని, వాటిని అతిక్రమించడం సరికాదని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు పీఎంయూ విడుదల చేసిన నోటిఫికేషన్ చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది.

# పెన్షన్ ప్రయోజనాలపై నిర్లక్ష్యమేల?

- **రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు మొట్టికాయలు**
- **వరంగల్ జిల్లాలో పెన్షనర్‌కు వెంటనే ఆర్థిక ప్రయోజనాలు ఇవ్వాలి**

ముద్ర, తెలంగాణ బ్యూరో :



రిటైర్డ్ ఉద్యోగులకు అందవలసిన పదవీ విరమణ ప్రయోజనాల చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై తెలంగాణ హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. పదవీ విరమణ తర్వాత పెన్షనర్లకు ఇవ్వాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రంగారెడ్డి జిల్లా కోర్టులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి ఆరు నెలల క్రితం రిటైర్ అయిన విజయ్ కుమార్ అనే ఉద్యోగికి రావాల్సిన రూ.90 లక్షల బెనిఫిట్స్ ఇంకా అందలేదు. దీనిపై ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం విచారించిన న్యాయస్థానం, తెలంగాణ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శికి కఠిన ఆదేశాలు జారీ చేసింది. విజయ్ కుమార్‌కు రావాల్సిన పెన్షన్ ప్రయోజనాలను రాబోయే నాలుగు వారాల్లోగా పూర్తిస్థాయిలో చెల్లించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ నిర్ణీత గడువులోగా ఈ చెల్లింపులు జరగకపోతే, టోకెన్ జారీ చేసిన తేదీ నుంచి 18 శాతం వార్షిక వడ్డీతో కలిపి ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించింది. వృద్ధాప్యంలో తమ కష్టార్జితం కోసం ఉద్యోగులు కోర్టుల చుట్టూ తిరగడం సరికాదని, తక్షణమే ఈ బకాయిలను విడుదల చేయాలని న్యాయస్థానం ప్రభుత్వానికి ఆదేశించింది.





# హైదరాబాద్‌లో ఇండియా టెక్నాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన రెడ్‌వుడ్ సాఫ్ట్‌వేర్

ముద్ర, తెలంగాణ బ్యూరో:


రెడ్‌వుడ్ సాఫ్ట్‌వేర్ తమ ప్రపంచ స్థాయి ఇండియా టెక్నాలజీ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. ఈ కేంద్రం ద్వారా ప్రపంచవ్యాప్తంగా సంస్థ చేపడుతున్న ఏఐ అభివృద్ధి వేగవంతం కానుంది. సంస్థ తమ ఉద్యోగుల్లో దాదాపు మూడింట ఒక వంతు మందిని స్థానికంగా నియమించుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. స్వయంప్రతిపత్తి కలిగిన వ్యాపార సంస్థల కోసం సమన్వయ నిర్వహణ వేదికగా నిలిచిన రెడ్‌వుడ్ సాఫ్ట్‌వేర్, హైదరాబాద్‌ను తమ ప్రాథమిక కార్యకలాపాల కేంద్రంగా ఎంచుకుని భారతదేశంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించింది. ఈ కొత్త కేంద్రం ఏఐ ఆధారిత ఆటోమేషన్‌లో ఆవిష్కరణలను మరింత వేగవంతం చేయనుంది. సంక్లిష్టమైన హైబ్రిడ్ ఐటి ల్యాండ్‌స్కేప్‌లలో కీలక కార్యకలాపాలను నిర్వహించే రెడ్‌వుడ్ సామర్థ్యాన్ని ఈ కేంద్రం బలోపేతం చేయనుంది. హైదరాబాద్ కేంద్రం వ్యూహాత్మక ఆవిష్కరణల హబ్‌గా పనిచేసి, సంస్థ ఏజెంటిక్ ఆర్కెస్ట్రేషన్ రోడ్‌మ్యాప్‌ను వేగవంతం చేయడంతో పాటు 150కు పైగా దేశాల్లో 7,000 మందికి పైగా వినియోగదారులకు సేవలను మెరుగుపరచనుంది. హైటెక్ సిటీలో ఉన్న ఈ 30,000 చదరపు అడుగుల కేంద్రం ఫుల్‌స్టాక్ ఇంజనీరింగ్, ఉత్పత్తి ఆవిష్కరణ, ప్రపంచవ్యాప్త కార్యకలాపాలకు మద్దతు ఇచ్చేలా రూపొందించబడింది. రెడ్‌వుడ్ తమ స్థానిక సిబ్బందిని గణనీయంగా పెంచాలని యోచిస్తోంది. 2027 చివరి నాటికి ఇంజనీరింగ్, క్లౌడ్, వ్యాపార కార్యకలాపాల విభాగాల్లో 300 మందికి పైగా కొత్త నియామకాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కేంద్రాన్ని ఐకం (తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్) వ్యవస్థాపక ముఖ్య కార్యనిర్వహణాధికారి ఫణి నాగార్జున, రెడ్‌వుడ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కెవిన్ గ్రీన్, ఇంజనీరింగ్ వైస్ ప్రెసిడెంట్, రెడ్‌వుడ్ ఇండియా కంట్రీ హెడ్ రాజ్‌కుమార్ పాల్‌రాజ్ తదితరులు కలిసి ప్రారంభించారు.



# కాళేశ్వరం అవినీతిపై హైకోర్టు క్లీన్ చిట్ ఇవ్వలేదు

- **ఇది పూర్తిగా ప్రొసీజరల్ అంశం**
- **కేవలం సాంకేతిక అంశాలనే ప్రస్తావించింది**
- **పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని సమర్థించింది**
- **కాళేశ్వరంపై హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ఇరిగేషన్ శాఖ వివరణ**

ముద్ర, తెలంగాణ బ్యూరో:





కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక విషయంలో హైకోర్టు వెలువరించిన తీర్పు కేవలం సాంకేతిక అంశాలకు సంబంధించిందే తప్ప, ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని హైకోర్టు పూర్తిగా సమర్థించిందని తెలిపింది. కమిషన్ ఏర్పాటును ఎక్కడా తప్పుబట్టలేదని పేర్కొంది. ఈ మేరకు బుధవారం కాళేశ్వరంపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ఇరిగేషన్ శాఖ స్పందించింది. విచారణ నివేదికలో పేర్కొన్న కొందరు బాధ్యులపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి, వారికి నోటీసులు ఇవ్వలేదనే సాంకేతిక, విధానపరమైన అంశాలను మాత్రమే కోర్టు ప్రస్తావించిందని వివరించింది. నోటీసులు ఇవ్వని కారణంగా వారిపై చేసిన వ్యాఖ్యలు 'ఇన్ ఆపరేటివ్'గా ఉంటాయని కోర్టు సూచించినట్లు వెల్లడించింది. ఇది పూర్తిగా ప్రొసీజరల్ అంశమని ప్రభుత్వం పేర్కొంది. హైకోర్టు తీర్పు ఈ కేసులోని బాధ్యులెవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని, సీబీఐ విచారణకు ఎలాంటి అడ్డంకి లేదని ఇరిగేషన్ శాఖ స్పష్టం చేసింది.

**ప్రాజెక్టు వైఫల్యంపై ప్రభుత్వ ఆందోళన**

రూ. లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు కేవలం మూడేళ్లకే కుంగిపోవడంపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ కుంగిపోయిందని, అక్కడ తప్పు జరిగిందన్నది అక్షర సత్యమని పేర్కొంది. ప్రాజెక్టు సైట్ ఎంపిక, డిజైన్లు, నిర్మాణంలో లోపాలున్నాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, విజిలెన్స్ కమిషన్ ఇప్పటికే నివేదికలు సమర్పించాయి. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా సుదీర్ఘ విచారణ తర్వాత ప్రాజెక్టులోని లోపాలు, అవకతవకలు, బాధ్యుల వివరాలను వెల్లడించింది.

**సీబీఐ దర్యాప్తు కొనసాగింపు**

**బాధ్యులెవరో తేల్చాల్సిన బాధ్యత తమపై ఉందని పేర్కొంటూ ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, ఘోష్ కమిషన్ నివేదికల ఆధారంగా దర్యాప్తు జరపాలని ప్రభుత్వం ఇప్పటికే సీబీఐకి లేఖ రాసింది. ఈ మేరకు గతేడాది సెప్టెంబర్ 1న ఈ దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ ప్రభుత్వం జీవోతో పాటు నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. హైకోర్టు వెలువరించిన పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత ప్రభుత్వం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనుంది.**



# ఆరుగురు ఐపీఎస్ లకు డీజీగా పదోన్నతి

- **మహేశ్ భగవత్, స్వాతి లక్రా, వీవీ శ్రీనివాసరావుకు డీజీ హోదా**

ముద్ర, తెలంగాణ బ్యూరో :

రాష్ట్ర పోలీసు శాఖలో పలువురికి పదోన్నతులు జరిగాయి. ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు డీజీ హోదా కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 1995 బ్యాచ్ కు చెందిన ఏడీజీలు మహేశ్ భగవత్, స్వాతి లక్రా, వీవీ శ్రీనివాసరావుకు డీజీ హోదా కల్పించారు. 1996 బ్యాచ్‌కు చెందిన చారుసిన్హా, అనిల్ కుమార్, సజ్జనార్‌లకు డీజీ ర్యాంకులు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ఆరుగురు అధికారులు తమకు పదోన్నతి లభించినప్పటికీ ప్రస్తుతం వారు ఏ బాధ్యతల్లో ఉన్నారో అవే పోస్టింగ్స్‌లో కొనసాగుతారని ప్రభుత్వం స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు వీరు తమ ప్రస్తుత విభాగాల్లోనే డీజీ హోదాలో సేవలందించనున్నారు.



# కొండగట్టులో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు

- **మే 11 నుంచి మూడు రోజులపాటు జరగనున్న వేడుకలు**
- **ఏర్పాట్లు పర్యవేక్షించిన అధికారులు**

ముద్ర ప్రతినిధి, జగిత్యాల :

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రముఖ ఆంజనేయస్వామి పుణ్యక్షేత్రమైన కొండగట్టులో మే 11 నుంచి హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొండగట్టు అంజన్న ఆలయంలో మే 11, 12, 13 తేదీలలో మూడు రోజులపాటు అత్యంత వైభవంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఈ జయంతి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, ఆలయ ఈఓ ఎస్. అంజనారెడ్డి ఇతర అధికారులతో కలిసి ఆలయ పరిసరాల్లో ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. జయంతి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



# రూ.148 కోట్లతో అప్రోచ్ రోడ్లు

- **1:4 నిష్పత్తిలో ప్రతిపాదనలు పంపండి**
- **ఇన్‌ఫ్రా స్ట్రక్చర్, క్యాపిటల్ వర్క్స్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి**

ముద్ర, తెలంగాణ బ్యూరో:

రాష్ట్రంలో మూడేళ్ల క్రితం బ్రిడ్జిలు నిర్మించినప్పటికీ వాటికి అప్రోచ్ రోడ్లు నిర్మించకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఇన్‌ఫ్రా స్ట్రక్చర్, క్యాపిటల్ వర్క్స్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన రూ.148 కోట్ల నిధుల విడుదలకు క్యాబినెట్ సబ్ కమిటీ ఆమోదం తెలిపిందని డిప్యూటీ సీఎం ప్రకటించారు. సరైన పద్ధతిలో ప్రతిపాదనలు పంపితే ఆమోదం పొందడం, అమలు చేయడం సులభమవుతుందని, పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. 1:4 నిష్పత్తిలో వివిధ శాఖల నుంచి ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపితే సబ్ కమిటీలు చర్చించి ఆమోదం తెలుపుతాయని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని జూన్ 8లోపు అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ పనుల పురోగతిని ప్రతి వారం ప్రత్యేకంగా సమీక్షిస్తానని స్పష్టం చేశారు. టెండర్లు పిలవడం, పనులు చేపట్టడం, నాణ్యతతో పనులు పూర్తి చేయడం వంటి అంశాలను తాను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
23.04.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## నిద్ర త్వరగా పట్టాలంటే.?

రోజూ వ్యాయామం చేయడం రోజులో కొంత సమయం ఫిజికల్ యాక్టివిటీ చేయండి. ఇది రాత్రికి అలసట కలిగించి మంచి నిద్రకు సహాయపడుతుంది.



## పవర్‌ప్లే వైఫల్యమే ఓటమికి కారణం

**వేణుగోపాల్ రావు**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఉప్పల్‌లో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. 243 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేధించడంలో విఫలమైన ఢిల్లీ, 47 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. మ్యాచ్ అనంతరం జట్టు క్రికెట్ డైరెక్టర్ వై. వేణుగోపాల్ రావు ఓటమికి గల కారణాలను స్పష్టం చేశారు. పవర్‌ప్లేలో ఆశించిన స్థాయిలో పరుగులు చేయకపోవడమే ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి భారీ లక్ష్యాన్ని చేధించాలంటే తొలి ఆరు ఓవర్లలో కనీసం 8090 పరుగులు చేయాల్సి ఉంటుందని, కానీ తమ జట్టు 59 పరుగులకే పరిమితమైందని అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఆరంభంలో వేగం లోపించడంతో మ్యాచ్‌పై ప్రభావం పడింది" అని అన్నారు. ఓపెనర్ పాతుమ్ నిస్సంక త్వరగా అవుటవ్వడంతో కెప్టెన్ కేఎల్ రాహుల్‌కు సరైన స్ట్రైక్ దక్కలేదని వివరించారు. పవర్‌ప్లేలో రాహుల్ తక్కువ బంతులు ఎదుర్కోవడం, నితీష్ రాణా రిథమ్ అందుకోలేకపోవడం జట్టు మొమెంటమ్‌ను దెబ్బతీసిందని తెలిపారు. అలాగే బౌలింగ్ మార్పులపై వచ్చిన విమర్శలకు స్పందిస్తూ, టి20ల్లో కెప్టెన్ తీసుకునే నిర్ణయాలు అప్పటికప్పుడు పరిస్థితులపై ఆధారపడతాయని చెప్పారు. రిస్కులు ఫలిస్తే ప్రశంసలు వస్తాయని, లేకపోతే విమర్శలు సహజమని వేణుగోపాల్ రావు వ్యాఖ్యానించారు.



## మా సక్సెస్‌కు కారణం అదే

**ఇషాన్ కిషన్**



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా మూడో విజయంతో జోరును కొనసాగిస్తోంది. ఉప్పల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై 47 పరుగుల తేడాతో గెలిచిన ఈ జట్టు, పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరింది. ఇప్పటివరకు 7 మ్యాచ్‌లలో నాలుగు విజయాలు నమోదు చేసింది. విజయం అనంతరం కెప్టెన్ ఇషాన్ కిషన్ మాట్లాడుతూ, తమ జట్టు విజయానికి సరళమైన వ్యూహమే కారణమని వెల్లడించాడు. ఒక్కో మ్యాచ్‌ను ప్రత్యేకంగా తీసుకుంటూ, పరిస్థితులకు అనుగుణంగా ఆడటమే తమ బలం అని చెప్పాడు. అభిషేక్ శర్మ ఇన్నింగ్స్, చివర్లో హెన్రిచ్ క్లాసెన్ ఫినిషింగ్ జట్టుకు పెద్ద ప్లస్ అయ్యాయని పేర్కొన్నాడు. పిచ్‌ను అర్థం చేసుకున్న తర్వాత దూకుడుగా ఆడటమే తమ విధానం అని వివరించాడు. బౌలింగ్‌లోనూ కీలక సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం కలిసి వచ్చిందని, ఆటను ఆస్వాదిస్తూ ఆడమనే సందేశమే జట్టును ముందుకు నడిపిస్తోందని ఇషాన్ తెలిపాడు.



## టీ20లో అభిషేక్ రికార్డు

**గేల్ మార్క్ బ్రేక్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

టీ20 క్రికెట్‌లో భారీ స్కోర్లు చేయడం అంత సులభం కాదు. అలాంటి ఫార్మాట్‌లో 130కి పైగా పరుగులు చేయడం అంటే అసాధారణ ప్రతిభ కావాలి. ఇప్పుడు ఈ అరుదైన జాబితాలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ అగ్రస్థానంలో నిలిచాడు. ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ 135 నాటౌట్‌తో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇన్నింగ్స్‌తో టీ20ల్లో నాలుగు సార్లు 130+ స్కోర్లు చేసిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. అతడి దూకుడు, పవర్ హిట్టింగ్, టైమింగ్ అన్నీ లిసి అతడిని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. ఇప్పటివరకు ఈ రికార్డు వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ పేరిట ఉండగా, అతడు మూడు సార్లు 130+ స్కోర్లు చేశాడు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఆరోన్ ఫించ్ కూడా మూడు సార్లు ఈ ఫీట్ సాధించాడు. ఇప్పుడు అభిషేక్ వారిని అధిగమించి కొత్త చరిత్ర రాశాడు. ప్రస్తుతం అతడు చూపిస్తున్న ఫామ్ చూస్తే, భవిష్యత్తులో మరిన్ని భారీ ఇన్నింగ్స్‌లు నమోదు చేసే అవకాశం కనిపిస్తోంది.



## ధోనీపై మారిన అభిప్రాయం

**సైనికుడిగా నిరూపించుకున్న కెప్టెన్ కూల్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఎంఎస్ ధోనీ అంటే క్రికెట్ గుర్తుకు వస్తుంది. కానీ ఆయనలో దేశభక్తి కూడా అంతే గట్టిగా ఉందని మరోసారి స్పష్టమైంది. భారత ప్రాదేశిక సైన్యంలో గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదా పొందిన ధోనీ, ఆ పాత్రలోనూ తన నిబద్ధతను చాటుకున్నారు. ఈ హోదా ఇవ్వడంపై తొలినాళ్లలో కొంత వ్యతిరేకత ఉన్నట్లు రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ వినోద్ భాటియా వెల్లడించారు. ముఖ్యంగా 'మెరూన్ బెరెట్' వంటి ప్రతిష్టాత్మక గుర్తింపును సాధారణ వ్యక్తికి ఇవ్వడంపై సందేహాలు వ్యక్తం చేశానని తెలిపారు. పారాట్రూపర్ అవ్వాలంటే కఠినమైన శిక్షణ అవసరం ఉండగా, అలాంటి పరీక్షలు లేకుండా ఈ గౌరవం ఇవ్వడం సరికాదని అప్పట్లో భావించినట్లు చెప్పారు. అయితే, ధోనీ తన ప్రవర్తనతో ఆ అనుమానాలను పూర్తిగా చెదరగొట్టారని భాటియా పేర్కొన్నారు. 106 పారా టీఏ బెటాలియన్‌లో చేరిన ధోనీ, సాధారణ సైనికుడిలాగే క్రమశిక్షణతో వ్యవహరించడమే కాకుండా, 2015లో ఐదు పారాచూట్ జంప్‌లు పూర్తి చేసి 'పారా వింగ్' సాధించారు. ఎత్తుపై భయం ఉన్నప్పటికీ, దేశం కోసం ఆ భయాన్ని జయించి తన కర్తవ్యాన్ని నిర్వర్తించిన ధోనీపై భాటియా ప్రశంసలు కురిపించారు. జమ్మూ కశ్మీర్‌లో నియంత్రణ రేఖ వద్ద సైనికులతో కలిసి పనిచేసిన ఆయనలో నిజమైన సైనికుడి లక్షణాలు కనిపించాయని అన్నారు. దీంతో తొలినాళ్లలో ఉన్న తన అభిప్రాయం పూర్తిగా మారిందని భాటియా వెల్లడించారు.



## రాహుల్‌పై విమర్శల వర్షం

**బ్యాటింగ్, కీపింగ్ రెండూ నిరాశ**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడుతున్న లోకేష్ రాహుల్ ప్రదర్శనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత సీజన్లలో మెరుగైన రికార్డులు కలిగిన ఈ స్టార్ బ్యాటర్, ఈసారి మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 243 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేధించే క్రమంలో రాహుల్ 23 బంతుల్లో 37 పరుగులకే పరిమితమయ్యాడు. స్ట్రైక్‌రేట్ బాగానే ఉన్నప్పటికీ, అవసరమైన సమయంలో దూకుడుగా ఆడకపోవడం జట్టుపై ప్రభావం చూపిందని విమర్శలు వస్తున్నాయి. అదే మ్యాచ్‌లో కీపింగ్‌లోనూ రాహుల్ తప్పిదాలు చేశాడు. కీలక సమయంలో అభిషేక్ శర్మను రన్ అవుట్ చేసే అవకాశం వదిలేయగా, ఆ తర్వాత అతడు భారీ స్కోర్ నమోదు చేయడం మ్యాచ్ మలుపు తిప్పింది. ఈ ప్రదర్శనతో సోషల్ మీడియాలో రాహుల్‌పై ట్రోల్స్ పెరిగాయి. అభిమానులు అతని ఆటతీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా కూడా పెద్ద లక్ష్యాలను ఛేదించాలంటే పవర్‌ప్లేను సరిగ్గా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని సూచించాడు.



## స్లో ఓవర్‌రేట్‌కు బంగ్లాదేశ్‌కు జరిమానా

- మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత
- ఐసీసీ చర్య

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో ఘనవిజయం సాధించిన బంగ్లాదేశ్ జట్టుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ICC) షాక్ ఇచ్చింది. నిర్ణీత సమయంలో బౌలింగ్ కోటాను పూర్తి చేయనందుకు (Slow Overrate) గాను బంగ్లాదేశ్ జట్టుకు జరిమానా విధించారు. బంగ్లాదేశ్ ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించారు. ICC కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని ఆర్టికల్ 2.22 ప్రకారం నిర్ణీత సమయం కంటే బంగ్లాదేశ్ రెండు ఓవర్లు తక్కువగా వేసినట్లు ఐసీసీ ఎలైట్ ప్యానెల్ మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ నిర్ధారించారు. ప్రతి ఓవర్ ఆలస్యానికి 5 శాతం చొప్పున, రెండు ఓవర్లకు కలిపి 10 శాతం జరిమానా విధించారు. బంగ్లా కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ తన తప్పును అంగీకరించడంతో తదుపరి విచారణ అవసరం లేకుండానే శిక్ష ఖరారైంది. ఈ మ్యాచ్ ఏప్రిల్ 20న మీర్పూర్‌లోని షేర్‌ఎ బంగ్లా స్టేడియంలో జరిగింది. యువ పేసర్ నహీద్ రాణా తన కెరీర్ బెస్ట్ ప్రదర్శన చేశాడు. కేవలం 32 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి న్యూజిలాండ్ జట్టును కట్టడి చేశాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన కివీస్ జట్టు 48.4 ఓవర్లలో 198 పరుగులకే ఆలౌటైంది. నిక్ కెల్లీ 83 పరుగులతో రాణించాడు. 199 పరుగుల లక్ష్యాన్ని బంగ్లాదేశ్ జట్టు 35.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తంజీద్ హసన్ 76, కెప్టెన్ శాంతో 50 పరుగులతో అర్ధ సెంచరీలు సాధించారు.

## పంజాబ్ జట్టుకు బిగ్ షాక్

**స్టార్ బ్యాట్స్‌మెన్ దూరం..**



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

: ఓటమి లేకుండా దూసుకెళ్తున్న పంజాబ్ జట్టుకు బిగ్ షాక్.. స్టార్ బ్యాట్స్‌మెన్ దూరం.. ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు ప్రస్తుతం తిరుగులేని ఫామ్‌లో ఉంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ ఆ జట్టు అద్భుతమైన ప్రదర్శన చేస్తూ అభిమానులను అలరిస్తోంది. పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకపోవడం విశేషం. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఐదు విజయాలు నమోదు చేయగా, ఒక మ్యాచ్ మాత్రం వర్షం కారణంగా డ్రాగా ముగిసింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతూ ప్లేఆఫ్స్ దిశగా దూసుకుపోతున్న పంజాబ్ జట్టుకు ఇప్పుడు ఒక ఎదురుదెబ్బ తగిలింది. ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున బ్యాటింగ్‌లో చెలరేగిపోతున్న ఆస్ట్రేలియా యువ సంచలనం కూపర్ కొన్నోలీ జట్టును వీడి అర్ధాంతరంగా ఆస్ట్రేలియాకు పయనమయ్యాడు. వెన్ను గాయం కారణంగా ఇబ్బంది పడుతున్న అతనికి, ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు కీలక సూచనలు చేసింది. ఏప్రిల్ నెలాఖరు వరకు అతడిని కేవలం బ్యాటర్‌గా మాత్రమే ఆడాలని, బౌలింగ్ చేయవద్దని స్పష్టం చేసింది. అయితే.. తాజాగా తన బౌలింగ్ ఫిట్‌నెస్‌ను పరీక్షించుకోవడానికి, పూర్తిస్థాయి వైద్య పరీక్షల కోసం అతను ఆస్ట్రేలియా వెళ్ళినట్లు సమాచారం. ఈ సీజన్‌లో కొన్నోలీ పంజాబ్ జట్టుకు వెన్నెముకగా నిలిచాడు. ముఖ్యంగా గుజరాత్ టైటాన్స్‌పై 72 పరుగులు, లక్నో సూపర్ జెయింట్స్‌పై 87 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరగబోయే ముఖ్యమైన మ్యాచ్‌కు కేవలం మూడు రోజుల ముందు అతను జట్టుకు దూరం కావడం పంజాబ్ కింగ్స్ మేనేజ్‌మెంట్‌ను కొంత ఆందోళనకు గురిచేస్తోంది. అయితే అతను కేవలం ఫిట్‌నెస్ క్లియరెన్స్ కోసమే వెళ్ళాడని.. త్వరలోనే తిరిగి జట్టుతో చేరుతాడని అభిమానులు ఆశిస్తున్నారు.

## ధోని కాళ్లు పట్టుకున్న ముంబై ఇండియన్స్ ఆటగాడు



**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ధోని కాళ్లు పట్టుకున్న ముంబై ఇండియన్స్ ఆటగాడు.. ప్రపంచ క్రికెట్‌లో భారత్‌పాకిస్తాన్ మ్యాచ్ ఎంత క్రేజీగా ఉంటుందో.. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ (MI), చెన్నై సూపర్ కింగ్స్ (CSK) మధ్య పోరు అంత ఆసక్తికరంగా ఉంటుంది. రోహిత్ శర్మ నాయకత్వంలో ముంబై, ధోనీ కెప్టెన్సీలో చెన్నై చెరో 5 సార్లు ఛాంపియన్‌గా నిలిచాయి. ఇప్పుడు ఐపీఎల్ 2026లో ఈ రెండు జట్లు తలపడనున్నాయి. ఏప్రిల్ 23, గురువారం నాడు ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది.

ఈ మ్యాచ్‌కు ముందు ముంబై ఇండియన్స్ ఒక సరదా వీడియోను షేర్ చేసింది. ఇందులో దీపక్ చాహర్ తన పాత గురువు ఎంఎస్ ధోనీని కలవడానికి వెళ్లారు. చాహర్ వెనకాలే కెమెరామెన్ రావడం చూసి ధోనీ స్పందిస్తూ.. "నువ్వు వస్తూ వస్తూ నీతో పాటు కెమెరాను కూడా తీసుకొచ్చావు" అని సరదాగా అన్నారు. దానికి చాహర్ కూడా కెమెరామెన్‌తో.. "భయ్యా వెళ్ళిపోండి, మేము మాట్లాడుకోలేము" అని నవ్వుతూ చెప్పారు. ఆ తర్వాత చాహర్ ధోనీ పాదాలకు నమస్కరించి తన గౌరవాన్ని చాటుకున్నారు.

**గురువుకు ఎదురుగా శిష్యుడు..**

దీపక్ చాహర్ ఐపీఎల్ కెరీర్ ధోనీ నాయకత్వంలోనే మొదలైంది. 2016లో రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్ తరపున ధోనీ కెప్టెన్సీలో ఆయన అరంగేట్రం చేశారు. ఆ తర్వాత చెన్నై సూపర్ కింగ్స్‌లో కీలక బౌలర్‌గా ఎదిగారు. అయితే.. ఐపీఎల్ 2025 మెగా వేలంలో ముంబై ఇండియన్స్ చాహర్‌ను రూ.9.25 కోట్లకు కొనుగోలు చేసింది.

**ధోనీ రీ-ఎంట్రీ..?**

ఈ మ్యాచ్‌లో అందరి కళ్ళు ధోనీపైనే ఉన్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ధోనీ ఫిట్‌నెస్ సమస్యల వల్ల ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. కానీ.. ముంబైతో జరిగే ఈ పెద్ద మ్యాచ్‌లో ఆయన బరిలోకి దిగే అవకాశం ఉందని అభిమానులు ఆశిస్తున్నారు. ఒకప్పుడు ధోనీ శిష్యుడిగా ఉన్న చాహర్, ఇప్పుడు ముంబై తరపున ధోనీ జట్టుపై ఎలా బౌలింగ్ చేస్తారో చూడాలి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
23.04.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





## నాభి అందాలతో నషా ఎక్కిస్తున్న అదితి

### క్రేజీ పోజులకు నెటిజన్స్ మైండ్ బ్లాక్


అదితి గౌతమ్తన లేటెస్ట్ బోల్డ్ ఫోటోషూట్‌తో కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తోంది. తన నాభి అందాలను ఎరగా వేస్తూ, నషా ఎక్కించే కిల్లర్ పోజులతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ గ్లామరస్ ట్రీట్‌కు నెటిజన్లు క్లీన్ బౌల్డ్ అవుతూ, ఆమె హాట్ అండ్ సెన్సేషనల్ లుక్స్‌ను వైరల్ చేస్తున్నారు! తాజా ఫోటోలలో ఆమె ట్రెండీ అవుట్‌ఫిట్‌లో కనిపిస్తూ, ధైర్యమైన పోజులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె లుక్, ప్రెజెన్స్ నెటిజన్లను ఆకట్టుకుని, ఫోటోలు వైరల్ అవుతున్నాయి. అదితి గౌతమ్ ఈ ఫోటోషూట్ ద్వారా మరోసారి తన గ్లామర్ ఇమేజ్‌ను బలంగా ప్రదర్శించిందని చెప్పవచ్చు.

## భారీ సెట్‌లో 'కల్కి 2' ఇంటర్వెల్ బ్యాంగ్

ముద్ర, సినిమా డెస్క్ :

రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన 'కల్కి 2898 AD' విజయంతో దాని సీక్వెల్‌పై అంచనాలు గణనీయంగా పెరిగాయి. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'కల్కి 2' ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ కొనసాగుతోంది. తాజా షెడ్యూల్‌లో అమితాబ్ బచ్చన్‌కు సంబంధించిన కీలక సన్నివేశాలు చిత్రీకరించగా, ఇప్పుడు భారీగా నిర్మించిన ప్రత్యేక సెట్లో ఇంటర్వెల్ సీన్‌ను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఈ భాగం సినిమాకే హైలెట్‌గా నిలుస్తుందని చెబుతున్నారు. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌తో సినిమా మరింత గ్రాండ్‌గా రూపుదిద్దుకుంటోంది. మొదటి భాగాన్ని మించిన స్థాయిలో 'కల్కి 2'ను తీర్చిదిద్దేందుకు దర్శకుడు కృషి చేస్తున్నట్లు తెలుస్తోంది.





## చరిత్రలోనే కాదు

### సినీ తెరపైనా చిరస్థాయి సామ్రాట్ శివాజీ

ముద్ర, సినిమా డెస్క్ : భారతీయ చరిత్రలోనే కాదు, వెండితెరపై కూడా ఛత్రపతి శివాజీ మహారాజ్ ఒక అజరామరమైన ప్రతీకగా నిలిచారు. మరాఠా సామ్రాజ్య స్థాపకుడిగా ఆయన చూపిన ధైర్యం, నాయకత్వం తరతరాలకు స్ఫూర్తినిచ్చినట్లే, సినిమాల్లోనూ ఆయన గాథ ప్రేక్షకులను కట్టిపడేస్తూనే ఉంది. ప్రతి తరానికి కొత్త కోణంలో శివాజీ కథను చెప్పేందుకు దర్శకులు ముందుకు వస్తుండటం, ఆయన ప్రభావం ఎంత విస్తృతమో తెలియజేస్తోంది. తాజాగా రితేష్ దేశ్‌ముఖ్ తెరకెక్కిస్తున్న 'రాజా శివాజీ' చిత్రం ఈ వారసత్వాన్ని మరోసారి తెరపైకి తీసుకురాబోతోంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం మే 1న విడుదలకు సిద్ధమవుతుండగా, ఇప్పటికే అంచనాలు పెరిగాయి. అయితే ఈ సినిమాకు ముందు కూడా శివాజీ మహారాజ్ జీవితం, ఆయన కాలంలోని వీరుల త్యాగాలను ప్రతిబింబించిన పలు చిత్రాలు ప్రేక్ష కు ల ను ఆ క ట్టుకున్నాయి. 'ఛావా' చిత్రం ద్వారా శంభాజీ మహారాజ్ గాథను చూపిస్తూ, శివాజీ సిద్ధాంతాల ప్రభావాన్ని తెలియజేశారు. 'తానాజీ'లో సింహగఢ్ యుద్ధం నేపథ్యంలో మరాఠా వీరుల పరాక్రమాన్ని చూపించగా, 'హర్ హర్ మహాదేవ్' పావన్‌ఖిండ్ యుద్ధంలోని త్యాగాన్ని ప్రతిబింబించింది. అలాగే 'ఫతేషికస్త్'లో గెరిల్లా యుద్ధ తంత్రాలు, 'పావన్‌ఖిండ్'లో బాజీ ప్రభు దేశ్‌పాండే త్యాగం హృదయాలను తాకాయి. పాత తరానికి చెందిన 'ఛత్రపతి శివాజీ' చిత్రం ఆయన జీవితాన్ని క్లాసిక్‌గా ఆవిష్కరించగా, నేటి సినిమాలు ఆధునిక టెక్నాలజీతో అదే గాథను మరింత గొప్పగా చూపిస్తున్నాయి. ఈ అన్ని చిత్రాలు కలిపి చూస్తే, శివాజీ మహారాజ్ కేవలం చరిత్రలోనే కాదు, భారతీయ సినీ ప్రపంచంలో కూడా చిరస్థాయి సామ్రాట్‌గా నిలిచారని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

## 'సిటాడెల్ 2'తో ప్రియాంక యాక్షన్ రీ ఎంట్రీ

ముద్ర, సినిమా డెస్క్ :

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా మళ్లీ తన యాక్షన్ అవతార్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఆమె నటించిన గూఢచారి థ్రిల్లర్ 'సిటాడెల్' తొలి సీజన్ భారీ స్పందన తెచ్చుకున్న నేపథ్యంలో, ఇప్పుడు రెండో సీజన్‌పై ఆసక్తి మరింత పెరిగింది. 'సిటాడెల్ సీజన్ 2'లో ప్రియాంక 'నదియా సిన్హ్' పాత్రలో మరింత శక్తివంతంగా కనిపించనుంది. గత జ్ఞాపకాలను కోల్పోయిన గూఢచారి మళ్లీ తన అసలు రూపంలోకి వచ్చి ప్రపంచాన్ని రక్షించేందుకు చేసే పోరాటం ఈ సీజన్‌కు హైలెట్ కానుంది. తాజాగా విడుదలైన పోస్టర్‌లో ఆమె లుక్ యాక్షన్ డోస్‌ను రెట్టింపు చేస్తుందనే సంకేతాలు ఇస్తోంది. మే 6, 2026న ఈ సీజన్ విడుదల కానుండగా, తెలుగు సహా పలు భారతీయ భాషల్లో స్ట్రీమింగ్‌కు రానుంది. రిచర్డ్ మ్యాడెన్‌తో కలిసి 'మాంటికోర్' అనే ప్రమాదకర సంస్థను ఎదుర్కొనే కథ మరింత ఉత్కంఠను రేకెత్తిస్తోంది. భారీ నిర్మాణ విలువలు, హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలతో ఈ సిరీస్ మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునేలా కనిపిస్తోంది.



## శ్రీలీల మళ్లీ ట్రాక్‌లోకి వచ్చేనా?

ముద్ర, సినిమా డెస్క్ :

టాలీవుడ్ యంగ్ బ్యూటీ శ్రీలీల మరోసారి తన లేటెస్ట్ ఫోటోషూట్‌తో అభిమానులను ఆకట్టుకుంది. ఐవరీ అనార్కలి డ్రెస్సులో గోల్డ్ ఎంబ్రాయిడరీతో ఆమె కనిపించిన తీరు ఎలిగెన్స్‌కు నిదర్శనంగా నిలిచింది. సింపుల్ లుక్‌లోనే ఆకర్షణీయంగా మెరిసి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే సినిమాల విషయానికి వస్తే, ఇటీవల వచ్చిన 'రాబిన్‌హుడ్', 'జూనియర్', 'ఉస్తాద్ భగత్ సింగ్' ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయాయి. ముఖ్యంగా ఆమె పాత్రలకు సరైన ప్రాధాన్యం లేకపోవడం విమర్శలకు కారణమైంది. ఇప్పటికీ గ్లామర్, డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో మంచి క్రేజ్ ఉన్న శ్రీలీల, సరైన కథలు ఎంపిక చేసుకుంటే మళ్లీ హిట్ ట్రాక్‌లోకి రావడం కష్టమేమీ కాదని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.



## చందు మొండేటి మల్టీస్టారర్ ప్లాన్... భారీ కాంబో సెట్!

ముద్ర, సినిమా డెస్క్ :

టాలీవుడ్ యువ దర్శకుడు చందు మొండేటి మరో పెద్ద ప్రాజెక్టుతో వార్తల్లో నిలిచాడు. 'తండేల్' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న ఆయన, ఆ తర్వాత పలు ప్రయత్నాలు చేసినప్పటికీ కొన్ని ప్రాజెక్టులు కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు మాత్రం ఓ క్రేజీ మల్టీస్టారర్‌ను సెట్ చేసినట్లు సమాచారం. అక్షయ్ కుమార్, రానా దగ్గుబాటి ప్రధాన పాత్రల్లో ఉజ్జయిని నేపథ్యంతో హిస్టారికల్ థ్రిల్లర్ తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ కథను ఇద్దరు హీరోలకు వినిపించగా, వారు సానుకూలంగా స్పందించినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో మరో స్టార్ హీరో కూడా కీలక పాత్రలో కనిపించే అవకాశం ఉన్నట్లు సమాచారం. బాలీవుడ్ నిర్మాత కరణ్ జోహార్ ఈ ప్రాజెక్టును నిర్మించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద, కొంతకాలం వేచి చూసిన చందు మొండేటికి ఇప్పుడు పెద్ద అవకాశం దక్కినట్టే కనిపిస్తోంది.



## 'కాక్‌టెయిల్ 2'లో కృతి అందాల అరాచకం

ముద్ర, సినిమా డెస్క్ :

బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ 'కాక్‌టెయిల్ 2'లో తన స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంటోంది. హోమీ అదజానియా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూన్ 19, 2026న విడుదల కానుంది. ఇందులో షాహిద్ కపూర్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా కృతి షేర్ చేసిన ఫోటోల్లో బోహో స్టైల్ ఫ్లోరల్ డ్రెస్‌లో ఆమె గ్లామర్ హైలెట్ అయింది. సముద్రం నేపథ్యంగా తీసిన ఈ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. స్టార్ కాస్ట్, రొమాంటిక్ కథతో 'కాక్‌టెయిల్ 2'పై ఇప్పటికే మంచి క్రేజ్ ఏర్పడింది.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com